
రైల్వేకోడూరు ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుల బంధువులు



శేషాచలంలో ఏనుగుల బీభత్సం..!

మహాశివరాత్రి సందర్భంగా శివయ్య దర్శనానికి వెళుతున్న భక్తులపై ఏనుగులు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. రైల్వేకోడూరుకు చెందిన భక్తులు కాలినడకన శేషాచలం కొండల్లో నుంచి తలకోనకు వెళుతుండగా సోమవారం రాత్రి చిమ్మచీకట్లో ఒక్కసారిగా భక్తులపై దాడి చేశాయి. దీంతో దిక్కుతెలియని స్థితిలో తలోదిక్కుకు పరుగులు తీశారు. ముగ్గురిని తొక్కి చంపేశాయి. మరో నలుగురు గాయపడగా అందులో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

- ముగ్గురు మృతి... నలుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- గుండాలకోనకు సమీపంలో సంఘటన
- రెండు గ్రామాల్లో విషాదఛాయలు
- సంఘటనపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దిగ్భ్రాంతి
- మృతుల కుంటుంబాలకు రూ.10 లక్షలు.. గాయపడ్డ వారికి రూ.5 లక్షలు


రైల్వేకోడూరు ఆస్పత్రి శవపరీక్ష గది వద్ద గుమికూడిన జనాలు


సంఘటనపై ఆరా తీస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


తీవ్రంగా గాయపడిన అమ్ములు అలియాస్ పాపమ్మ


తీవ్రంగా గాయపడిన పలిగిల రాజశేఖర్


వంకాయల దినేశ్ మృతదేహం


ఏనుగుల దాడిలో మృతి చెందిన తుపాకుల మణెమ్మ


తిరుపతి చంగ్రలాయుడు మృతదేహం

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలం లోని ఉర్లగట్టుపోడు అరుంధతివాడ, కన్నెగుంట గిరిజన కాలనీలకు చెందిన భక్తులు 30 మంది తిరుపతి జిల్లా నెరబైలు సమీపంలో ఉన్న తలకోనకు కాలినడకన సోమవారం రాత్రి 7 గంటల సమయంలో గుండాలకోన మీదుగా అడ్డదారిలో బయలుదేరారు. బాగా చీకటి పడింది. టార్చిలైట్లు పట్టుకుని వెళుతుండగా మంగళవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో గుండాలకోనకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఏనుగుల మంద తారసపడింది. 30 మందిలో ఒకరు స్టీలు టిఫిన్ బాక్సుతో శబ్దం చేయడంతో అవి భక్తులపై దాడి చేశాయి. ఉర్లగట్టుపోడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వంకాయల దినేశ్ (34)కు భార్య రాజేశ్వరి ఉంది. వీరికి పది రోజుల క్రితం కొడుకు పుట్టడంతో తలనీలాలు సమర్పించేందుకు తలకోనకు వెళుతూ ఏనుగుల దాడిలో బలయ్యాడు. అలాగే కన్నెగుంట గిరిజన కాలనీకి చెందిన తుపాకుల మణెమ్మ (40), తిరుపతి చంగ్రలాయుడు (35) అనే వారిపై దాడి చేసి అక్కడికక్కడే చంపేశాయి. ఉర్లగట్టుపోడు అరుంధతివాడ గ్రామానికి చెందిన పలిగిల రాజశేఖర్, వెంకట సుబ్బయ్య, వెంకటరత్నమ్మ, కన్నెగుంట గిరిజనకాలనీకి చెందిన అమ్ములు అలియాస్ పాపమ్మలు గాయపడ్డారు. వీరిలో రాజశేఖర్, అమ్ములు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఒకరు తిరుపతి రుయా, మరొకరిని రేణిగుంట సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

విషయం తెలుసుకున్న అటవీ శాఖ, పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వై.కోట గ్రామస్థుల సహకారంతో మృతదేహాలతో పాటు గాయపడిన వారిని రైల్వేకోడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వేకోడూరు రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని గుండాలకోన వైపు ఎవరినీ వెళ్లనివ్వకుండా అదుపు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జిల్లా అటవీ శాఖాధికారి ఆర్.జగన్నాథ్‌సింగ్, రైల్వేకోడూరు సబ్ డీఎఫ్‌వో సుబ్బరాజు, రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏనుగుల మంద దాడిలో ముగ్గురు మృతి చెందడంతో ఉర్లగట్టుపోడు, కన్నెగుంట గిరిజనకాలనీల్లో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, కూటమి నాయకులు వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ముక్కా ఫౌండేషన్ తరుఫున మృతుల కుటుంబాలకు రూ.లక్ష, గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.25 వేలు ప్రకటించి చెక్కులు పంపిణీ చేశారు. ఖర్చులకు గాను ఒక్కొక్కరికి రూ.20 వేలు సాయంగా పంపిణీ చేశారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, గాయపడిన కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం ప్రభుత్వం ద్వారా అందించాలని స్థానిక అటవీశాఖాధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విజయవాడ నుంచి వచ్చి బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు.

పలువురు పరామర్శ

మృతుల కుటుంబాలను మంగళవారం టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ పరామర్శించారు. అదే విధంగా కూటమి యువ నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, గుత్తి నరసింహ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండారు బుజ్జమ్మ, సీపీఎం జిల్లా నాయకులు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి తదితరులు పరామర్శించారు.

30 మందిలో 20 మంది సేఫ్

తలకోనకు కాలినడకన వెళ్లిన 30 మందిలో 20 మంది ఏనుగుల బారి నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వారి ఇళ్లకు చేరిపోయారు. ఏనుగుల ఘీంకారాలకు తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ పొదల్లో దాక్కుని మెల్లగా ఇంటి దారి పట్టారు. కొందరు చెట్లు ఎక్కి కూర్చుకున్నారని, మరికొందరు పెద్దపెద్ద పొదల్లో దాక్కున్నారని వెళ్లిన వారు తెలిపారు.

పొదలో దాక్కున్నాము...



మేము అందరం తలకోనకు వెళ్లి శివయ్యను దర్శించుకుని వచ్చేందుకు ఐదు రోజుల నుంచి ప్రణాళిక తయారు చేసుకున్నాము. 30 మంది జత అయ్యాము. సోమవారం రాత్రి 7 గంటల సమయం నుంచి తలకోనకు కాలినడక ప్రారంభించాము. మాకు సరిగ్గా 2 గంటల ప్రాంతంలో దట్టమైన అడవిలో ఏనుగులు తారసపడ్డాయి. ఏనుగులను స్వాములు అంటాము. అదేవిధంగా స్వాములు వచ్చారని ఒకరికొకరం చెప్పుకున్నాము. అయితే మేము ఒక పొదలోకి వెళ్లి దాక్కున్నాము. నా కుమార్తె అమ్ములు అలియాస్ పాపమ్మ కాలు బయట ఉండడంతో ఆ కాలును ఏనుగు తొక్కింది. దీంతో నా భార్య మణెమ్మ కేకలు పెట్టింది. దీంతో ఏనుగులు ఒక్కసారిగా మీదపడి తొక్కేశాయి. దీంతో నా భార్య మణెమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. నా భార్య ఒకవైపు చనిపోయి పడిపోయింది.. నా కుమార్తె కాలు విరిగి ఉంది ఏమి చేయాలో దిక్కు తోచక బిక్కుబిక్కుమంటూ తెల్లవారిందాకా ఉండాల్సి వచ్చింది. తర్వాత పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వచ్చి రైల్వేకోడూరుకు తరలించారని ప్రత్యక్ష సాక్షి కన్నెగుంట గిరిజనకాలనీకి చెందిన సిద్ధయ్య మీడియాకు వివరించారు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా : కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండలంలో జరిగిన ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం సహాయంతో నగదు రహిత చికిత్స అందిస్తున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భక్తులు అటవీ ప్రాంతంలో నుంచి వెళ్లడానికి ప్రయత్నం చేసినప్పుడు అటవీశాఖాధికారులు వారిని రిజర్వ్ అటవీ ప్రాంతం నుంచి వెళ్లకూడదని హెచ్చరించినప్పటికీ వారు వెళ్లారన్నారు. చనిపోయిన ముగ్గురి కుటుంబాలకు ప్రభుత్వం తరపున 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు తెలిపారు. గాయపడ్డ వారికి చికిత్స అందచేస్తున్నామని, వారికి ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పారన్నారు. బుధవారం శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులెవ్వరూ అడవి లోపలికి వెళ్లకూడదని తెలిపారు.

ఆకేపాటా.. మజాకా...!

- అది అల్లాటప్పా ఎస్టేట్ కాదు..
- వేరే లెవెల్.. సకల సౌకర్యాలు అక్కడే..
- దర్జాగా ప్రభుత్వ భూములు కబ్జా
- ఆపై అక్రమంగా రిజిస్ట్రేషన్లు.. విలాసవంతమైన నిర్మాణాలు
- అక్రమాల నిగ్గు తేల్చేందుకు రంగంలోకి రెవెన్యూ


ఎస్టేట్‌లోని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్వగృహం

సాధారణంగా ఎక్కడైనా.. తమ సొంత భూముల్లోనో.. లేదా తమకు ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ భూముల్లోనే ఎస్టేట్‌లు నిర్మించుకోవడం మనం చూస్తూ ఉంటాం. అయితే ఆకేపాటి ఎస్టేట్ వేరే లెవల్‌లా ఉంటుంది. ఇక్కడ అదీ.. ఇదీ అని కాకుండా.. అన్ని సౌకర్యాలూ ఉంటాయి. ఈ ఎస్టేట్ సుమారు 57 ఎకరాల్లో ఉంది. ఇక్కడ స్విమ్మింగ్ పూల్, గుర్రపుశాల, ప్రైవేటు పాఠశాల ఉన్నాయి. ఇవన్నీ ఉండడం కాదు కానీ.. ఈ ఎస్టేట్ అంతా ప్రభుత్వ భూమి కావడం విశేషమైతే.. ఈ భూమంతా ఒక కుటుంబంలోని సభ్యుల పేర్ల మీదే ఉండడం.. ఆ కుటుంబం పెద్ద ప్రస్తుత రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కావడం మరీ విశేషం.

వివరాలు 6లో

కలెక్టరేట్‌కు ఏసీబీ భయం!

- తలుపులు వేసుకుని విధుల నిర్వహణ
- ఇతరులను అనుమతించవద్దని ఆదేశాలు
- అటెండర్ల సాయంతో పర్యవేక్షణ


6

గృహాల కోసం 35 వేల దరఖాస్తులు

- హౌసింగ్ పీడీ సాంబశివయ్య

6

వైభవోపేతం వీరభద్రుడి బ్రహ్మోత్సవం

- మూడో రోజు ఘనంగా యాళి వాహనం
- నవగ్రహ హోమం, సింహ వాహనోత్సవం


యాళి వాహనంపై ఊరేగుతున్న వీరభద్రుడు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవం వైభవోపేతంగా జరుగుతోంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీరభద్రాలయంలో మూడోరోజు ఉదయం నవగ్రహ హోమం, యాళి వాహనోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల బృందంచే వేదమంత్రోచ్చారణల మధ్య నవగ్రహ హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యాళి వాహనం సందర్భంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారిచే ఏర్పాటు చేసిన చెక్కభజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. రాత్రికి సింహవాహనంపై పట్టణ పురవీధుల్లో స్వామి వారు ఊరేగారు. అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు నరసింహారెడ్డి, జహీర్‌లు పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ మధుసూదన్ ఆదేశించారు. మంగళవారం ఆయన వాల్మీకిపురంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో నవోదయం కార్యక్రమంపై స్థానిక అధికారులు, సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ధరలకు దొరుకుతోందని నాటుసారాకు బానిసలవుతున్నారని, ముఖ్యంగా నాటుసారా తయారీ, విక్రయాలు సాగిస్తున్న వ్యక్తులు ఎంతటివారైనా ఉపేక్షించక చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల సహకారంతో ముమ్మర నిఘా పెట్టి నాటుసారా నిర్మూలనే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. బయటి రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాపై కూడా నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసి పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ లత, ఎస్‌ఐ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో ఎక్సైజ్ అధికారులకు సూచనలిస్తున్న ఈఎస్ మధుసూదన్


శివోహం

- శివాలయాలకు తరలివెళుతున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు
- ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు

మదనపల్లె, ఫిబ్రవరి 25 : మహాశివరాత్రికి జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. కొండాకోనల్లో కొలువైన పరమేశ్వరుడి దర్శనం కోసం భక్తులు మంగళవారం నుంచే పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు నీటిగుండాలలో స్నానాలాచరించి శివుడిని దర్శించుకోనున్నారు. రాత్రంతా జాగారం చేయనున్నారు. పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులు చేస్తున్న శివనామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగుతున్నాయి. ఇప్పటికే ఆయా ఆలయాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని కొలువుదీరిన మహిమ గల మల్లేశ్వరస్వామి ఆలయాలు భక్తుల కొంగు బంగారంగా బాసిల్లుతున్నాయి. తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి, మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జునస్వామి, కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని అఖండ మల్లికార్జునస్వామి, రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి ఆలయం, రాజంపేట నియోజకవర్గంలోని నిత్యపూజస్వామికోన ఆలయం, హత్యరాల, రైల్వేకోడూరులో నియోజకవర్గంలోని చిట్వేలి గుండాలకోన ఆలయాలకు పెద్దఎత్తున భక్తులు తరలివెళుతున్నారు. ఆర్టీసీ అధికారులు శైవక్షేత్రాలకు పెద్దఎత్తున ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.


రాజంపేటలోని హత్యరాల పుణ్యక్షేత్రం


గుండాలకోనలోని కర్కటేశ్వరుడి ఆలయం వద్ద శివలింగం


నిత్యపూజాకోనలో భక్తులు


విద్యుద్దీప కాంతుల్లో మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి ఆలయం

ఆకేపాటా.. మజాకా...!

- అది అల్లాటప్పా ఎస్టేట్ కాదు..
- వేరే లెవెల్.. సకల సౌకర్యాలు అక్కడే..
- దర్జాగా ప్రభుత్వ భూములు కబ్జా
- ఆపై అక్రమంగా రిజిస్ట్రేషన్లు.. విలాసవంతమైన నిర్మాణాలు
- అక్రమాల నిగ్గు తేల్చేందుకు రంగంలోకి రెవెన్యూ



ఆకేపాటి అమరనాథరెడ్డికి సంబంధించిన ఆకేపాటి ఎస్టేట్ ముఖద్వారం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తన కుటుంబ సభ్యుల పేరుతో సుమారు 57 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమించారని రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి గత ఏడాది అక్టోబరులో ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదుపై విచారణ చేశారు. ఇందులో అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా ప్రభుత్వ భూమి (గయాలు భూమిని) ఆన్‌లైన్ చేయించుకున్నట్లు నిర్ధారించారు. అంతే కాకుండా ఆ భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయించినట్లు.. భర్త భార్యకు.. భార్య భర్తకు.. అన్న తమ్మునికి.. తమ్ముడు అన్నకు.. ఇలా మొత్తం అన్ని ఎకరాలనూ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం విశేషం. కనీసం డీకేటీ పట్టాలు ఇచ్చిన భూములు కూడా కాని.. ప్రభుత్వ భూములను అధికారులు కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్లు చేసేయడం మరీ దుర్మార్గం.

అడంగల్, వన్‌బీలో నమోదు

ఆకేపాటి అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు రాజంపేట మండలం మందపల్లె, ఆకేపాడు గ్రామాలలో అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మందపల్లె గ్రామంలో బ్లాక్ సర్వే నెంబరు 553లో ఉన్న 1905.60 ఎకరాలను భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేసేందుకు ప్రభుత్వం ముక్కలుగా విభజించింది. ఇందులో ప్రభుత్వ లెక్కల ప్రకారం 25.05 ఎకరాలు అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇందులో 563 సర్వే నెంబరు పట్టా భూమి. ఆకేపాడు గ్రామంలో 56 సర్వే నెంబరులో 20.10 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం ముక్కలుగా విభజించింది. ఇందులో 56/1లో 5 ఎకరాలు, 56/8లో 5.68 ఎకరాలు, 56/9లో 2.35 ఎకరాలు కలిపి 13.03 ఎకరాలను అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు ఆన్‌లైన్ చేసుకున్నారు. ఈ భూమిని ప్రభుత్వం ఎవరికీ అసైన్‌మెంటు కింద ఇవ్వలేదు.

కుటుంబ సభ్యుల పేర్లతో ఆన్‌లైన్..

మందపల్లె గ్రామంలో.. ఆకేపాటి జ్యోతమ్మ, భర్త ఆకేపాటి అమరనాథరెడ్డి పేరు మీద (ఖాతానంబరు 704) 814/3లో 4 ఎకరాలు, ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి పేరు మీద (ఖాతానంబరు 277) 814/4లో 5 ఎకరాలు, ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి పేరు మీద (ఖాతానంబరు 705)లో 815/1లో 3.79 ఎకరాలు, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి ఎ.ఎల్.ఎన్.నారాయణరెడ్డి పేరు మీద (ఖాతానంబరు 707) 815/2లో 5 ఎకరాలు, 816/2లో 4.31 ఎకరాలు.. ఆకేపాడు గ్రామంలో ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్ రెడ్డి పేరుమీద (ఖాతా నంబరు 1213) సర్వేనంబరు 56/8లో 5.68 ఎకరాలు, ఆకేపాటి జ్యోతమ్మ భర్త అమరనాథరెడ్డి పేరు మీద (ఖాతా నెంబరు 1212) 56/9లో 2.35 ఎకరాలు ఆన్‌లైన్ అక్రమంగా చేయించుకున్నారు.

ప్రైవేటు పాఠశాల, స్విమ్మింగ్ పూల్, గుర్రపుశాల



ఇలా అక్రమంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాలలో ఆకేపాటి కుటుంబం ఓ ప్రైవేటు పాఠశాల, స్విమ్మింగ్‌పూల్, గుర్రపుశాలను నిర్మించుకుంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారు. ఆ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పుడు పాఠశాల గదులుగా మారిపోయాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆ పాఠశాలకే ఆకేపాటి అమరనాథరెడ్డి పాఠశాలగా నామకరణం చేశారు. తమ సొంత నిధులతో పేదలకు ఉచిత విద్యాబోధన చేస్తున్నట్లు పైకి కనిపిస్తున్నారు. ఇక్కడే వైసీపీ కార్యకర్తల కోసం సమావేశ మందిరం, జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు క్యాంపు కార్యాలయం ఉన్నట్లు సమాచారం. ఈ విలాసవంతమైన ఎస్టేట్‌లో ఎన్నో రకరకాల జంతువులు, చిలుకలు, పిట్టలు ఇలా ఎన్నెన్నో మూగజీవాలు ఉన్నాయి. ఇక్కడే పశువుల పాక, అన్నింటికి మించి గుర్రపుశాల, అందులో రేసు గుర్రాలు, ఎస్టేట్‌ను కాపలా కాసే రేసు కుక్కలు, ఉద్యానవన పంటలు ఇలా.. ఎన్నెన్నో ప్రత్యేకతలు ఇక్కడ ఉన్నాయి. ఈ ఎస్టేట్ ఆనుకుని ఆలయాల సముదాయం పక్కన పేదల కోసం ఓ కల్యాణమండపాన్ని ఏర్పాటు చేశారు. అయితే అక్కడ కల్యాణమండపానికి ఉన్న రూములు కూడా ఇందిరమ్మ ఇళ్లే అని పలువురు పేర్కొంటున్నారు. ఈ ఎస్టేట్ ప్రధాన ముఖద్వారం వద్ద పదుల కొద్దీ అటు ఇటు వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రభుత్వ భూమిలో కట్టడం విశేషం. ఆకేపాటి ఎస్టేట్‌లోని ప్రైవేటు భవనానికి చుట్టుపక్కల ప్రభుత్వ, జడ్పీ నిధులతో భారీఎత్తున సిమెంటు రోడ్లు నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి.



ఇందిరమ్మ ఇళ్లలో ప్రైవేటు పాఠశాల

అక్రమంగా రిజిస్ట్రేషన్లు

సాధారణంగా ప్రభుత్వ, డీకేటీ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కుదరదు. నిషేధిత భూముల జాబితాలో ఉంటాయి. అయితే అమరనాథరెడ్డి కుటుంబసభ్యులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను రాజంపేటలో రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 మే 6 నుంచి 10వ తేదీ లోపు ఈ రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఇందులో పైన ఆన్‌లైన్ చేయించుకున్న వాళ్లందరూ.. భార్యలు భర్తల పేరు మీద.. భర్తలు భార్యల పేరు మీద, అన్న తమ్ముడు పేరుమీద.. తమ్ముడు అన్న పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం.. ఈ అక్రమాలలో హైలైట్.

మందపల్లె గ్రామంలో ఆకేపాటి జ్యోతమ్మ తన భర్త అమరనాథరెడ్డికి సర్వేనంబరు 814/3లోని నాలుగు ఎకరాలను డాక్యుమెంటు నెంబరు ద్వారా 1773/2023 అమ్మేశారు. సర్వే నెంబరు 814/4 ఐదు ఎకరాలను ఆకేపాటి సుజన తన భర్త అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు నెంబరు 1768/2023 ద్వారా అమ్మారు. సర్వే నెంబరు 815/1 3.79 ఎకరాలను ఆకేపాటి సుజన తన భర్త అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు 1767/2023 ద్వారా అమ్మారు. సర్వే నెంబరు 815/2లో ఐదు ఎకరాలు ఆకేపాటి అమరనాథరెడ్డి తన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు నెంబరు 1774/2023 ద్వారా అమ్మేశారు. 816/2లో 4.31 ఎకరాలను ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తన భార్య సుజనకు డాక్యుమెంటు నెంబరు 1770/2023 అమ్మారు. ఆకేపాడు గ్రామంలో సర్వే నెంబరు 56/8లో 5.68 ఎకరాలను ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తన భార్య సుజనకు డాక్యుమెంటు నెంబరు 1769/2023 ద్వారా అమ్మారు. 56/9లో 2.35 ఎకరాలను ఆకేపాటి అమరనాథరెడ్డి తన భార్య జ్యోతమ్మకు డాక్యుమెంటు 1772 ద్వారా అమ్మేశారు.

సర్వే నెంబరు 553ను పంచుకున్న ఆకేపాటి కుటుంబం

సర్వే నెంబరు 553లో 1,905.60 ఎకరాల భూమి ఒక బ్లాకుగా ఉంది. పేదలకు భూమి పంచేందుకు ప్రభుత్వం చేపట్టిన సబ్‌డివిజన్ ఆకేపాటి కుటుంబానికి వరంలా మారిందనే చెప్పవచ్చు. ఈ సర్వే నెంబరు ముక్కలుగా విభజించిన తర్వాత.. ఏర్పడిన 810 సర్వే నెంబరులో 8.46 ఎకరాలు ఆకేపాటి చిన్నమ్మ (భర్త రాజగోపాల్‌రెడ్డి), 811లో 7.48 ఎకరాలు ఆకేపాటి కార్తీక్‌రెడ్డి (తండ్రి రంగారెడ్డి), ఆకేపాటి శశాంక్ గోపాల్ రెడ్డి (తండ్రి రంగారెడ్డి) పేరుతో 7.5 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు. పై రెండు ప్రభుత్వ భూములు, 812/1లో 5 ఎకరాలు ఆకేపాటి అనసూయమ్మ భర్త లక్ష్మీవెంకట నారాయణరెడ్డి, 812/3లో 2.45 ఎకరాలు ఆకేపాటి అనసూయమ్మ భర్త ఆకేపాటి లక్ష్మీవెంకటనారాయణరెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి ఆకేపాటి లక్ష్మి వెంకట నారాయణరెడ్డి 2.45 ఎకరాలు ఆన్‌లైన్ చేయించుకున్నారు. 814/3లో ఆకేపాటి జ్యోతమ్మ భర్త అమరనాథరెడ్డి నాలుగు ఎకరాలు, 814/4లో ఐదు ఎకరాలు ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి, 815/1లో ఆకేపాటి సుజన 3.79 ఎకరాలు, 815/2లో ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ఐదు ఎకరాలు, 816/2లో ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి 4.31 ఎకరాలు ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇవి జిరాయితీ పట్టా భూములు. సర్వే నెంబరు 847/7లో గయాలు భూమి ఆకేపాటి రేణుక పేరు మీద 1.57 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు.

నిగ్గు తేల్చేందుకు రంగంలోకి రెవెన్యూ..

టీడీపీ మండల అధ్యక్షుడి ఫిర్యాదుతో.. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో.. జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆకేపాటి ఎస్టేట్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు రంగంలోకి దిగింది. ఇప్పటికే ఇక్కడ జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో సమాచారాన్ని సేకరించి.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వాళ్లకు నోటీసులు పంపించింది. అయితే జిల్లా జాయింట్ కలెక్టర్ ఇచ్చిన నోటీసుల మీద ఆకేపాటి కుటుంబం రాజంపేట సివిల్ జడ్జి కోర్టులో 3/2025, 4/2025, 5/2025 6/2025 నెంబర్లతో సూట్ దాఖలు చేశారు. జాయింట్ కలెక్టర్ ఇచ్చిన నోటీసులపైన తమకు అనుకూలంగా పర్మినెంట్ ఇంజక్షన్ కోసం సూట్ వేసినట్లు సమాచారం.



ఆకేపాటి ఎస్టేట్ ఆనుకుని ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న కల్యాణమండపం



- ఆకేపాటి ఎస్టేట్‌లోని గుర్రపుశాల

'తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడండి'



సీడబ్ల్యూసీ స్కీంను పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ

సిద్దవటం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని పంచాయతీ నిధుల్లో ఎక్కువ శాతం తాగునీటి సరఫరాకు వినియోగించాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ ఆదేశించారు. మండలంలోని మాధవరం గ్రామం లో సీపీడబ్ల్యూ స్కీంను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అం దించేందుకు వాడాలని, ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని, పైపుల లీకేజీలు తనిఖీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, శానిటేషన్ పనులు నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మెహతాజ్‌యాస్మిన్, ఆర్‌బ్ల్యూసీ డీఈ కిరణ్‌కుమార్, ఏఈ గులురాజు ప్రసాద్, పంచాయత సెక్రటరి లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

విషపు మొక్కలు తిని 20 మేకలు మృతి



మృతిచెందిన మేకలను పరిశీలిస్తున్న పశు వైద్యుడు

సిద్దవటం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విషపు మొక్కలు తిని 20 మేకలు మృతి చెందాయని పశువైద్యాధికారి శివశంకర్ తెలిపారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ మిట్టపల్లె గ్రామానికి చెందిన ఓబయ్య మంగళవారం తన మేకలను గ్రామ సమీపంలోని పంట పొలాల్లోకి మేతకు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం ఇంటి దగ్గర మేకలు నీళ్లు తాగిన అనంతరం కొద్ది సేపటికే 20 మేకలు మృతిచెందాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన మేకల విలువ 2 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. మృతి చెందిన మేకలను పశువైద్యాధికారి డాక్టర్ శివ శంకర్ పరిశీలించారు. నమూనాలు సేకరించి కడప వెటర్నరి వైద్యశాల ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషపు మొక్కలు తినడం తోనే మేకలు మృతిచెందినట్లు ల్యాబ్ పరీక్షలో తేలిందని, రైతుకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆయన అన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..



కుమార్ మృతదేహం

ములకలచెరువు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురకాయలకోట సమీపంలో మంగళవారం ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు...దేవళచెరువు పంచాయతీ మావిళ్ల వారిపల్లెకు చెందిన కుమార్ (58) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అతిగా మద్యం సేవించేవాడు. ఇతని భార్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం తెల్లవారుజామున బురకాయల కోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం సమీపంలోని జాతీయ రహదారి పక్కనే అతని మృతదేహం కనిపించింది. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే, వృద్ధుడి ముఖానికి ఒక వైపు తీవ్ర గాయాలు ఉండడంతో అతని మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

షటిల్ కోర్టు వద్ద గుండెపోటుతో..

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): షటిల్ ఆడిన అనంతరం విశ్రాంతి తీసుకుంటుండగా గుండెపోటు రావడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మదనపల్లె పట్టణం సుబాష్‌రోడ్డుకు చెందిన సుబ్రహ్మణ్యం (53) వేరుశనగ వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం ఉదయం షటిల్ ఆడిన కొద్ది సేపటికి గుండెపోటు రావడంతో కుప్పకూలి పోయాడు, వెంటనే మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 20 ఏళ్లుగా షెటిల్ ఆడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు

కలెక్టరేట్‌కు ఏసీబీ భయం!

- తలుపులు వేసుకుని విధుల నిర్వహణ
- ఇతరులను అనుమతించవద్దని ఆదేశాలు
- అటెండర్ల సాయంతో పర్యవేక్షణ



మూసి ఉన్న అడ్మినిస్ట్రేషన్ విభాగం తలుపులు

రాయచోటి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చేనేత, జవుళి శాఖ ఏడీ కృష్ణ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో కలెక్టరేట్ ఉలిక్కిపడింది. దీంతో జిల్లా అధికారులు సోమవారం సాయంత్రం 6 గంట ల నుంచి 8 గంటల వరకు కలెక్టరేట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ఎవరినీ కార్యాలయం లోపలికి రానివ్వరాదంటూ ఆదేశాలిచ్చినట్లు సిబ్బంది చెపుతున్నారు. కాగా, ఎవరో.. ఏదో తప్పు చేసి ఏసీబీ వారికి పట్టుబడితే కలెక్టరేట్ సిబ్బంది ఎందుకు భయపడుతున్నారని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టరేట్‌లోని కొన్ని విభాగాల్లో పైసలు ఇవ్వకుంటే ఫైలు కదలడం లేదన్న ఆరోపణలు వినిపిస్తుండడం తో అన్నమయ్య కలెక్టరేట్‌పై ఏసీబీ నిఘా ఉంచి నట్లు ప్రచారం సాగిందని గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు చెబు తున్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో కింది స్థాయి సిబ్బందిని పిలిచి హెచ్చరించారు. ప్రస్తుతం తలుపులు వేసుకుని ఉద్యోగులు విధులు నిర్వహించడం చూస్తుంటే చేస్తుంటే.. అధికారులు మళ్లీ పూర్వం లాగే మామూళ్ల కోసం ప్రజలను పీడిస్తున్నారేమో అని ప్రజలు సందేహిస్తున్నారు. ఈ విషయంలో రాజంపేట డివిజన్‌కు సంబంధించిన ల్యాండ్ సెక్షన్, రాయచోటి డివిజన్ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారుల పేర్లు కలెక్టరేట్‌లో మారు మోగుతున్నాయి. ఇది ఇలా ఉండగా కలెక్టర్ కార్యాలయంలోకి ఎవరికీ అనుమతి లేదని, అటెండర్‌తో సంకేతాలు పంపిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది అవినీతికి పాల్పడకుంటే, తలుపులు ఎందుకు వేసుకుంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గృహాల కోసం 35 వేల దరఖాస్తులు

- హౌసింగ్ పీడీ సాంబశివయ్య



సమీక్ష సమావేశంలో పీడీ సాంబశివయ్య

పీలేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గృహాల కోసం 34,757 దరఖాస్తులు అందినట్లు హౌసింగ్ పీడీ సాంబశివయ్య తెలిపారు. పీఎంఏవై-ఎన్టీఆర్ 2.0 కాలనీల పురోగతిపై మంగళవారం ఆయన పీలేరులోని హౌసింగ్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 9,727 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 11,243 గృహాల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లబ్ధిదారులను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. వీరికి గతంలో ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చేనేత కార్మికులకు రూ.50 వేలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు వారానికి రెండు సార్లు బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమ చేస్తున్నామన్నారు. పీలేరు నియోజకవర్గంలోని లే ఔట్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.2.84 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. లబ్ధిదారులు ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని తమ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలన్నారు. అనంతరం ఆయన మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురగోతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పీలేరు డీఈ రమణయ్య, ఏఈ చంద్రశేఖర రెడ్డి, ఎంఐసీలు హరిబాబు, నాదముని నాయక్, సొహైల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'మామిడి మొక్కలు తొలగిస్తాం'



ఆక్రమిత ప్రదేశంలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

సుండుపల్లె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గుట్టలు ఆక్రమించి నాటిన మామిడి చెట్లు తొలగిస్తామని వీఆర్‌వో చిట్టిబాబు తెలిపారు. ఈ నెల 19న 'గుట్టను గుల్ల చేశారు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ దైవాదీనం స్పందించారు. ఆర్ఐ శ్రీనివాసులునాయక్, సర్వేయర్ సుబ్బరాయుడు కొత్తపల్లి సమీపంలో గుండాలొంక, మొరంగుట్టలను సర్వే చేసి సుమారు ఒక ఎక రా 50 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి హద్దులు ఏర్పా టు చేసి బోర్డు నాటారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి మామిడి చెట్లు తొలగిస్తామని వీఆర్వో తెలిపారు. గుట్టలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతి లేకుండా అడవిలోకి వెళితే చర్యలు

- జిల్లా అటవీశాఖ అధికారి ఆర్. జగన్నాథ్‌సింగ్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వై.కోట గుండాలకోనలో ఉత్సవాలను రద్దు చేయడంతో పాటు, అక్కడికి వెళ్లేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఆర్. జగన్నాథ్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనుమతి లేకుండా రిజర్వు ఫారెస్టులోకి వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణులు నీరు, ఆహారం సరిగా లేక ఆకలితో ఉంటాయని. వాటిని రెచ్చగొడితే ప్రాణాలు పోతాయన్నారు. ప్రజలు అనుమతి లేకుండా అడవి లోకి వెళితే ప్రాణా లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గుండాలకోనకు వెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రైల్వేకోడూరు ఐఎఫ్ఎస్ అధికారి సుబ్బరాజు, రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు రద్దు

ఓబులవారిపల్లె : ఏనుగుల దాడి నేపథ్యంలో వైకోట గుండాల కోనలో శివరాత్రి ఉత్సవాలను రద్దు చేసినట్లు తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో మల్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ తెలిపారు. వై.కోట రిజర్వు ఫారెస్టులో ఉన్న గుండాల నీలకంఠేశ్వరస్వామి కోనకు భక్తులు వెళ్లడానికి అనుమతి రద్దు చేసినట్లు వివరించారు. దారి తప్పిన ఏనుగుల కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

వివాదాస్పదంగా వాలీశ్వరాలయ అర్చకుల నియామకం

రామసముద్రం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలసముద్రం గ్రామ సమీపంలో ఉన్న వాలీశ్వరస్వామి ఆలయ ప్రధాన పూజారి నియామకంపై వివాదం నెలకొంది. ఈ ఆలయంలో బలసముద్రం గ్రామానికి చెందిన లోకనాథం ప్రధాన పూజారిగా పని చేసేవాడు.. గత ఏడాది శివరాత్రి పండుగ సందర్భంగా ఆలయ నిర్వాహకులకు, పూజారి లోకనాథంకు మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడ్డాయి. దేవదాయ శాఖ అనుమతి లేకుండా ఆలయ భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించాడని, ఆలయ భూములను సాగు చేసుకుంటూ కౌలు చెల్లించడం లేదని, శివరాత్రి సందర్భంగా భక్తులు చెల్లించే కానుకలకు జమ ఖర్చులు చూపించడం లేదని సుమారు పద్దెనిమిది కుటుంబాల వారు ఆరోపణలు చేశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో పోలీసులు బలసముద్రం గ్రామస్తులపై కేసు నమోదు చేసి ఆలయానికి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఈ వ్యవహారంలో అప్పటి వైసీ పీ ప్రజా ప్రతినిధి తో పూజారి చేతులు కలిపాడనే విమర్శలున్నాయి. ఈ ఏడాది శివరాత్రి ఉత్సవాలకు బలసముద్రం గ్రామస్తులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయ కమిటీ వేశారు. ఈ కమిటీ లోకనాథంతో పాటు మరికొందరిని పూజారులుగా నియమించుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పూజారి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు కమిటీ నిర్ణయాన్ని ఆమోదిస్తూ ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆలయ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లోకనాథం స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దార్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు, దేవదాయ శాఖ ఈవో రమణ, సీఐ సత్యనారాయణ, స్థానిక ఎస్ఐ, రెవెన్యూ అధికారులు ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

● పండ్లతోటలను నాశనం చేస్తున్న గజరాజులు
● భయాందోళనలో అటవీ శివారు గ్రామాల ప్రజలు

భయం..భయం



ఏనుగుల దాడి సంఘటనతో ముగ్గురు మృతి చెందిన విషయం మంగళవారం కలకలం రేపింది. దీంతో అటవీ శివారు గ్రామాలకు చెందిన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ట్రెంచ్‌లు దెబ్బతిన్నాయి



మామిడి తోటల సమీ పంలో గతంలో ఉన్న ట్రెంచ్‌లు దెబ్బ తిన్నాయి. దీంతో ఏనుగులు తోటల్లోకి వచ్చేస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు తెలియ చేసినా పట్టించు కోలేదు.

- నాగినేని వెంకటరమణ, శెట్టిగుంట ఆదర్శ రైతు

ఏనుగులను కట్టడి చేయాలి



ఏనుగులు రాకుండా కట్టడి చేయాలి. లేదంటే పెద్ద ప్రమాదం జరిగే అవకాశా లు ఉన్నాయి. అటవీశాఖాధికారు లు, ప్రభుత్వం కలసి ఉమ్మ డిగా చర్యలు జరిపి తగు నిర్ణయాలు తీసుకోవాలి.

- ఈశ్వరయ్య, వై.కోట సర్పంచ్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అటవీ శివారు గ్రామాలైన ఇందిరానగర్, శివాజీనగర్, కన్నెగుంట గిరిజన కాలనీ, కుక్కలదొడ్డి, వాగేటికోన, దేశెట్టిపల్లె తది తర గ్రామాల ప్రజలు కూలీ పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు నిత్యం వ్యవసాయ రైతు కూలీ పనులకు వెళుతుంటారు. పొలాల్లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ప్రతి ఏటా ఏనుగుల గుంపు ఉద్యాన పంటలైన మామిడి, అరటి, బొప్పాయి పంటలను నాశనం చేస్తున్నాయి. అడవిలో నీరు, ఆహారం అతి తక్కువగా ఉండడమే ఇందుకు కారణం అని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. గతంలో కర్ణాటక రాష్ట్రంలో ఏనుగులు రాకుండా ఉండడానికి సోలార్ ట్రెంచ్‌ని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. అయితే అక్కడ అది ఫలితాలు చూపించక పోవడంతో ఇక్కడ ఏర్పాటు చేయలేకపో యారు. అయితే అటవీశాఖాధికారులు అడవి చుట్టూ గతంలో ట్రెంచ్‌లు తీయగా స్మగ్లర్ల దాటికి కొన్ని దెబ్బతినగా మరికొన్ని వర్షాలకు కుంగిపోయాయి. శెట్టిగుంట, బిల్లుపాటిపల్లె, కొత్తపల్లె, జానకీపురం తది తర ప్రాంతాల్లో పండ్ల తోటలను ప్రతి ఏటా నాశనం చేస్తున్నాయని రైతులు పలుమార్లు అధికారులకు విన్న వించినా ఏనుగుల కట్టడికి ఇంతవరకు పటిష్టమైన చర్యలు తీసుకోలేదు.

గతంలో ఏనుగుల దాడులు...

ఐదేళ్ల క్రితం శెట్టిగుంట పంచాయతీ పరిధిలోని లక్ష్మీ గారిపల్లెకు చెందిన ఓ వ్యక్తి మామిడి తోటలో ఉండ గా ఏనుగు దాడి చేసి గాయపరిచింది. పీలేరు మండ లంలోని కాకులారంపల్లె పంచాయతీలోని బందార్ల పల్లెకు చెందిన మోపిరెడ్డి చిన్నరాజారెడ్డి గత ఏడాది అక్టోబరు 15వ తేదీ తన ఆవులను మేతకు తోలు కెళ్లగా ఏనుగులు దాడి చేయడంతో మృతి చెందాడు.

ఇబ్బంది కలిగితే దాడి చేస్తాయి



సహజంగా ఏనుగులు పగటి పూట ప్రయాణం చేస్తాయి. రాత్రివేళలో ఆహారం తీసుకుం టాయి. ఆహారం తీసుకునే సమయంలో వాటికి ఇబ్బంది కల్గిస్తే అవి దాడులు చేస్తా యి. పిల్లలతో కలిసి వెళుతుం టాయి. చప్పుళ్లు చేస్తే అవి అసహనానికి గురై దాడి చేస్తాయి.

- నాగేశ్వర్‌నాయక్, ఎఫ్‌బీవో, వై.కోట



శెట్టిగుంట ప్రాంతంలో దెబ్బతిన్న ట్రెంచ్

జాతీయ హాకీలో మహిళలు సత్తా చాటాలి



జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర మహిళా జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ పోటీల్లో మహి ళల రాష్ట్ర జట్టు సత్తా చాటాలని నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీవో) ఆర్‌కే.యతిరాజ్ అన్నారు. నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మహిళల హాకీ రాష్ట్ర జట్టు శిక్షణ ముగింపు మంగళవారం జరి గింది.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏసీ స్టేడియంలో ఇటీవల జరి గిన రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన వివిధ జిల్లాల క్రీడాకారిణిలు జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి తర్ఫీదునిచ్చామన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారిణిలు ఉత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి, హర్యానాలో మార్చి 1 నుంచి 12 వరకు జరిగే జాతీయ పోటీల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం రాష్ట్ర జట్టుకు ఎంపికైన రమ్య(శ్రీకాకుళం), మేరీభవానీ కుసుమ(అనకాపల్లి), లక్ష్మీరేవతి(అనంతపురం), వరాలమ్మ నందిని(కాకినాడ), కళ్యాణి (విశాఖప ట్నం), పావని (సత్యసాయి), హారతి నందిని(కడప), దుర్గాభవాని (ఎన్‌టీ ఆర్), రుక్మిణి(తిరుపతి), ప్రగతిశ్రావణి(నెల్లూరు), ముజియబేగం (ప్రకా శం)లను ప్రత్యేకంగా అభినందించి, క్రీడాదుస్తులను, పరికరాలు పంపిణీ చేశారు. ఉప విద్యాశాఖాధికారి నాయక్, నెల్లూరు ఎంఈవో తిరుపాల్, ఎంసీహెచ్ హెచ్‌ఎం.కృష్ణయ్య, జిల్లా హాకీ సంఘం డైరెక్టర్ థామస్‌పీటర్, కార్యదర్శి జగన్, జట్టు కోచ్ అనిల్‌కుమార్, మేనేజర్‌లు రవికుమార్, రమ్య, జిల్లా హాకీ కోచ్ చందు, పీఈటీలు జీడీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మద్యం దుకాణం యజమాని మృతి



మధుసూదన్ నాయుడు (ఫైల్)

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తికి చెందిన తిప్పలూరు మధు సూదన్ నాయుడు(49) సోమవారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఎర్రగుంట్లలో మధు వైన్స్ నిర్వ హిస్తు న్నాడు. రాత్రి పనులు ముగించు కుని ఇంటికి బయలుదేరాడు. పోట్లదు ర్తిలో ఎన్‌టీ ఆర్ కాలనీ వద్ద ట్రాక్టర్ ఢీకొన డంతో తలకు తీవ్ర గాయాల య్యాయి. బంధువులు చికిత్స నిమిత్తం ప్రొద్దుటూ రు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ గురుశేఖర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయు డుకు మధు సమీప బంధువు కావడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

బైకుల దొంగ అరెస్టు



అరెస్టు చేసిన నిందితుని చూపుతున్న పోలీసులు

కడప క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఓ దొంగను పోలీసులు అరెస్టు చేశా రు. మంగళవారం కడప టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమా వేశం నిర్వహించి నిందితుడి వివరాలను సీఐ నాగార్జున వివరించా రు. కడప గంజికుంట కాలనీకి చెందిన గౌస్ బాషా నగరంలో తిరుగుతూ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి.. గౌస్‌న గర్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలో దాచి పెట్టి విక్రయించేవాడు. ఈ సమాచారం రావడంతో కడప డీఎస్పీ వెంక టేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్‌ఐలు హుసేన్, సిద్దయ్యలతో కలిసి నిందితున్ని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించి నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): తన భర్త గత రెండు రోజుల నుంచి కనిపించడం లేదని స్థానిక ఫక్కీరు వీధిలో నివాసం ఉంటున్న షేక్ రజియా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసిం ది. తన అబ్దుల్‌జలీల్ సంవత్సరం క్రితం గుండె కు బైపాస్ సర్జరీ జరిగిందని.. ఆ సమ యంలో వైద్య ఖర్చులకు కొందరి వద్ద డబ్బులు అప్పు తీసుకున్నాడు. ఆ అప్పులు తీర్చేమార్గం లేక కలత చెంది ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. పోలీసులు తన భర్త ఆచూకీ తెలపాలని కోరారు.

బండలాగుడు పోటీల్లో సత్తా చాటిన కడప జిల్లా ఎడ్లు

● మొదటి మూడు స్థానాలు కైవసం



గండవరంలో జరుగుతున్న ఎడ్ల బండలాగుడు పోటీలు

కొడవలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ వరంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం గంగా పార్వతి సమేత ఉదయకాళేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నెల్లూరు నగర టీడీపీ పరిశీలకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిలు ప్రారంభించారు. వీటిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒంగోలు, బాపట్ల, చిత్తూరు, కడప జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో గండ వరం వీధులు కిక్కిరిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 9 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహు మతి రూ.లక్షను కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దొరసాల గురవారెడ్డికి చెందిన ఎడ్లు కైవసం చేసుకోగా రెండు, మూడు స్థానాల్లో కడప జిల్లా మైదుకూరు చెందిన వెంకటేష్, కుర్ర వెంక టేష్, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో బాపట్ల జిల్లాకు చెందిన సాయిగణేష్, మారుమూల సుబ్బారెడ్డి, బాపట్ల వీరస్వాముల ఎడ్లు దక్కించుకున్నాయి. విజేతలకు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి బహుమతులు అందజేశారు.

బ్రౌన్ గ్రంథాలయ ఉనికి నలుమూలలకు వ్యాప్తి

● వైవీయూ ఉప కులపతి ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు



వైవీయూ ఉప కులపతిని సత్కరిస్తున్న సీపీ బ్రౌన్ సిబ్బంది

కడప కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని పాఠకులకు, సాహితీవేత్తలకు మరింత చేరువ చేసేలా కృషి చేసి.. తద్వారా సంస్థ ఉనికిని నలుమూలలా వ్యాప్తి చేస్తామని యోగివేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు అన్నారు. వైవీయూ ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి మంగళవారం ఆయన బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పనిచే స్తున్న సిబ్బంది ఎవరెవరు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో ఉప కులపతికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రౌన్‌చేసిన సాహిత్య కృషిని కొనియాడారు. పనిచేస్తున్న సిబ్బంది కృషిని అభినందించారు. ప్రధానంగా కేంద్రంలో తాళపత్ర గ్రంథా లను, రాత ప్రతులను భద్రపరచి పరిశోధకులకు అందుబాటులో ఉంచడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో గ్రం థాలయ అభివృ ద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య .జి. పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పరిశోధనా కేంద్రం సిబ్బంది ఆయనను సత్కరిచారు.

సేంద్రియ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న వెంకటసునీల్

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతు లు పాటించాలని సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ రాష్ట్ర అధికారి ఆర్.వెంకట సునీల్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళ వారం కమలాపురం వ్యవ సా య సబ్ డివిజనులోని కమలాపురం, వల్లూరు, ఎర్ర గుంట్ల, వీఎన్ పల్లె తదితర మండలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని నాలుగు రైతులు ఇండ్-గాప్ పద్ధతిలో రైతులు సాగు చేసిన పప్పు శనగ పం టలను పరిశీలించామన్నారు. సహాయ వ్యవసా య సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లోకి మారాలని తెలి పారు. కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు సరస్వతి, సాయిజ్యోతి, శ్రీకాంత్‌రెడ్డి, శ్యాం బాబు, వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : జేసీ



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమ స్యలను అధికారులు ఎప్పటిక ప్పుడు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎన్నో సమస్యలతో ప్రతినిత్యం తహసీల్దారు కార్యాల యం వస్తుంటారని.. త్వరగా పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సదస్సులో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రా ల్లో అర్జీలు ఇచ్చిన రైతులు తిరిగి జిల్లా కేంద్రానికి వస్తు న్నారని.. ఇక్కడ సమస్యల పరిష్కారం అయితే జిల్లా కేంద్రాలకు ఎందుకు వస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ సద స్సులో వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిం చాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూసమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. ఈప్రాం తంలో జరుగుతున్న రీసర్వే పకడ్బందీగా నిర్వహించాల న్నారు. కార్యక్రమం ఆర్డీవో జాన్ ఎర్విన్, తహసీల్దారు శివరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు పర్వీన్‌బేగం, శ్రీకాంత్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో గంజాయి గ్యాంగులు


● ఆరీఫ్ అనే వ్యకిపై మూకుమ్మడి దాడి, కిడ్నాప్
● స్నేహితుడి సహాయంతో బయటపడ్డ ఆరీఫ్
● కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో గంజాయి మత్తు మూలమూలలకు పాకుతోంది. గంజాయి గ్యాంగులు సైతం ఏర్పడుతున్నాయి. గతంతో రౌడీ గ్యాంగులు ఉంటే నేడు గంజాయి, డ్రగ్స్ ముఠాలు తయారయ్యాయి. ఇందుకు నిదర్శనంగా అమృత నగర్‌కు చెందిన స్టౌ రిపేర్లు చేసే షేక్ ఆరీఫ్ అనే వ్యక్తిని ఆదివారం చితకబాది చిత్రహింసలు పెట్టారు. అతని వద్దవున్న 4వేలు డబ్బును తీసుకున్నారు. మరో పదివేలు కావాలంటూ కిడ్నాప్ చేశారు. తెలివిగా స్నేహితుడికి లోకేషన్ షేర్ చేయడంతో కిడ్నాపర్ల నుంచి బయటపడిన ఉదంతం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సంఘటనపై ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..

అమృతనగర్‌కు చెందిన షేక్ ఆరీఫ్ నెల క్రితం ఎర్రగుంట్ల లో చేరాడు. అక్కడే స్టౌ రిపేరు షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావ డంతో ప్రొద్దుటూరులో స్నేహితులను కలవడానికి ఉదయం 11 గంటలకు ఆరిఫ్ ప్రొద్దుటూరుకు వచ్చాడు. తన బావ మరిది జాకీర్‌తో కలిసి వుండగా హౌసింగ్ బోర్డుకు చెందిన నరేష్ అనే స్నేహితుడు ఫోన్ చేసి మద్యం తాగడానికి పిలిచాడు. దీంతో ఆరిఫ్, జాకీర్‌లు నరేష్‌తో కలిసి ఆటోనగర్ దగ్గర వున్న శ్రీచైతన్య స్కూలు వెనుకవున్న ముళ్లపొదల వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీను, సంజీవనగర్‌కు చెందిన రమేష్‌లు ఆరీఫ్‌ను ముళ్ల కర్రలతో చితకబాదారు. ఇటీవల గంజాయి కేసులో చాపాడు పోలీసులకు పట్టించాడనే అనుమానంతో ఆరీఫ్‌ను పథకం ప్రకారం నరేష్‌తో పిలిపించి దాడి చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి ఏడు వరకు చితకబాదారు. అతని వద్దవున్న డబ్బును గుంజుకున్నారు. మరో పదివేలు ఇస్తే వదిలేస్తామని బెదిరించారు. ఆ తరువాత జాకీర్‌ను వదిలేయడంతో అతను ఇంటికి వెళ్లాడు. ఆరిఫ్ స్నేహితుడైన అమృత్‌నగర్‌కు చెందిన చిన్నకు జరిగిన విషయం చెప్పాడు. శ్రీనివాస నగర్‌కు చెందిన శ్రీనుకు చిన్న ఫోన్ చేసి ఆరీఫ్ మీ వద్ద వున్నాడంట కదా మీరు అడిగిన డబ్బు ఇస్తాను వదిలేయమని కోరాడు. శ్రీను ఆరీఫ్‌ను కొట్టి అప్పుడే పంపాము.. మా వద్ద లేడని చిన్నకు చెప్పాడు. దీంతో చిన్న ఆరీఫ్ కోసం ప్రొద్దుటూరు ఎర్రగుంట్ల ప్రాంతంలో రాత్రం తా వెతికాడు. కానీ ఆరిఫ్ ఆచూకీ లభించలేదు.

రాత్రి 2 గంటల సమయంలో చిన్న సెల్‌కు ఆరిఫ్ నుంచి వాయిస్ మెసేజ్ లోకేషన్ వచ్చింది. అందులో నేనే ప్రమాదంలో ఉన్నాను.. నా సెల్‌కు ఫోన్ కానీ మెసెజ్ కానీ చేయకుండా వెంటనే లోకేషన్ వద్దకు వచ్చేయి అని పెట్టాడు. ఆ లోకేషన్ మైదుకూరు మండలం వనిపెంట దగ్గరలోని ఆదిరెడ్డిపల్లె వద్ద వుందని గుర్తించి వెంటనే బైకు తీసుకొని అక్కడికి వెళ్లాడు. ఆదిరెడ్డిపల్లెలో ఒక ఫంక్షన్ సందర్భంగా డీజే పెట్టారు. అక్కడ ఆగి శ్రీను పవన్ అనే వ్యక్తులు మందు తాగి మత్తులో డ్యాన్సులు వేస్తూ వుండగా.. అక్కడే వున్న ఆరీఫ్‌ను గుర్తించి చిన్న అతన్ని బైక్ మీద తీసుకొచ్చాడు. మైదకూరు పోలీసుస్టేషన్లో అర్ధరాత్రి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. సోమ వారం తెల్లవారు జామును గంజాయి గ్యాంగు చేతిలో గాయపడిన ఆరీఫ్‌ను చిన్న ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్లో ఎస్‌ఐ మహ్మద్ రఫీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బర్డ్‌ఫ్లూ భయం వద్దు...



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు శారదమ్మ

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయం వద్దని.. అది మనుషులకు సోకదని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచా లకులు డాక్టర్ శారదమ్మ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవా రం బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గ్రుడ్లు, చికెన్ బాగా ఉడికించి తినవ చ్చని, దీనివల్ల ఎలాంటి జబ్బులు రావన్నారు. ఎలాంటి అపోహ లు నమ్మవద్దని తెలిపారు. అనంతరం కోడి గ్రుడ్లను పంపి ణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా: ఆర్డీవో

సిద్ధవటం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా అని ఆర్డీవో జాన్ ఇర్విన్ పేర్కొన్నారు. మంగళవారం శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యపూజేశ్వర కోనలో ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య శిబిరాన్ని, శానిటేషన్ పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీరు అపరిశుభ్రంగా ఉండడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. రోడ్లపై నీరు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వో ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోస పంటను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు

చిన్నమండెం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): వైరస్‌తో అన్నదాత విలవిల అన్న శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి స్పందించిన ఉద్యానశాఖ అధికారి వనితబాయ్ మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని దోస తోటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైరస్ దెబ్బతో పీకేసిన తోటలను వైరస్ అధికారంగా ఉన్న ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమలో ఉద్యానశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


శివయ్య దర్శనానికి సర్వం సిద్ధం


చిట్వేలి: ప్రత్యేక అలంకారంలో వీరభద్రుడు


సంబేపల్లె మండలంలో మోటకట్ల వద్ద అందంగా ముస్తాబైన శివాలయం


రాయచోటి: అలంకరణలో అగస్త్యేశ్వర స్వామి


ఓబులవారిపల్లె: అలంకరణలో గౌరీసిద్దేశ్వరుడు


చిట్వేలి: గుండాలకోన కర్కటేశ్వరాలయంలో జలపాతం


రాయచోటి: ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు

రాయచోటి నియోజకవర్గంలో శివాలయాల ముస్తాబు

సంబేపల్లె, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోకజకవర్గ వ్యాప్తంగా శైవ క్షేత్రాలు హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివనామస్మరణతో మార్మోగాయి. పాతరాయచోటిలో అగస్త్యేశ్వరాలయం, చెన్నముక్కపల్లె కాశీ విశ్వేశ్వరాలయం, మదనపల్లె రోడ్డులోని ఉమామహేశ్వర ఆలయం, సంబేపల్లె మండలంలోని మోటకట్ల వెంకటశివసాయి ఆలయం, చిన్నజంగంపల్లి చంద్రమౌళేశ్వర ఆలయం, సంబేపల్లె పశుపతినాథ ఆలయం, సుండుపల్లెలోని విరూపాక్ష చెన్నకేశవ ఆలయం, చింతలయ్యగారిపల్లెలో శివాలయం, మాచిరెడ్డిగారిపల్లె రాగిమాను బిడికి శివాలయం, సుండుపల్లె- పీలేరు మార్గంలోని తిమ్మసముద్రం, రామాపురం శివాలయం ముస్తాబయ్యాయి. కాగా బుధవారం శివపార్వతుల కల్యాణం జరుగుతుంది.


సుండుపల్లె: విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయం


పేటు కింద ఎండ్రకాయ రూపంలో దర్శనమిస్తున్న గుండాలకోన కర్కటేశ్వరుడు

రాజంపేట, కోడూరులలో శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

రాజంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని శివాలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నిత్యపూజకోన, హత్యరాల త్రేతేశ్వర స్వామి, చిట్వేలి మండలంలోని గుండాలకోన కర్కటేశ్వరాలయం, గుండ్లూరు శివాలయం, రైల్వేకోడూరు భుజంగేశ్వరాలయం, పెద్దఓరంపాడులోని గౌరీసిద్దేశ్వరస్వామి ఆలయం, బొమ్మవరంలోని గోకర్ణేశ్వరాలయం, పెనగలూరులోని శివాలయాలు అందంగా తయారయ్యాయి. ఆయా ఆలయ, ఉత్సవ కమిటీలు, దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. నిత్యపూజేశ్వరకోనలో సుమారు 200 మంది పోలీసులను బందోబస్తు కోసం ఏర్పాటు చేశారు. హత్యరాల ఆలయంలో సీఐ అలీ ఆధ్వర్యంలో 150 మంది పోలీసులను ఏర్పాటు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు త్రేతేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉన్నత పాఠశాలకు బీరువా వితరణ

గాలివీడు, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడు జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠ శాలకు పూర్వ విద్యార్థినులు అయిన సోఫియా, అమ్మజాన్, నస్రిన్, తహసీన్, పాఠశాల కమిటీ చైర్మన్ షేక్ ఆస్మా బీరువాను వితరణ చేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునవర్‌బాషా పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఫయాజ్‌బాషా, అజ్మీరాబాద్ విద్యార్థులకు అతిథి భోజనాన్ని పెట్టారని తెలిపారు. ఉపాధ్యాయులు గోవిందరెడ్డి, రియాజ్‌బాసా,ఫయాజ్, రహంతున్నీషా పాల్గొన్నారు.

శివస్వాముల ఇరుముడి కార్యక్రమంలో నిశ్చల్‌నాగిరెడ్డి

చిన్నమండెం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు, టీడీపీ యువనాయకుడు నిశ్చల్‌నాగిరెడ్డి మంగళవారం చిన్నర్సుపల్లిలో ఏర్పాటు చేసిన శివస్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లేశ్వరస్వామి ఇరుముడు కట్టే కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు.

ఎన్‌ఎస్‌ఐసీ చాంపియన్లకు సన్మానం

నందలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ స్టూడెంట్స్ ఇన్నోవేషన్ చాలెంజ్ 2025 సీజన్-8లో భాగంగా ఈనెల 20న బెంగుళూరులో జరిగిన ఫైనల్‌లో గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతులు సాధించారు. ప్రతిభ సాధించిన ఎస్.లక్ష్మీచైతన్య, ఎస్.జైనాబ్‌లకు వరల్డ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌మస్తాన్ సాహెబ్, ఏపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి జుల్ఫీకర్, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మహ్మద్ అజీమ్, అన్నమయ్య డిస్ట్రిక్ ప్రెసిడెంట్ అంకిపల్లి శివకుమార్‌లు సన్మానించారు.

మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రామాపురం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరం 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ శ్యామలాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఎస్ఈ.జీవోవీ.ఇన్ లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీయంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24, 2024-25 రెండు సంవత్సరాలు చదివి ఉండాలన్నారు. 2024-25 విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, ఎంఈవో, డీఈవోలను సంప్రదించాలని పేర్కొన్నారు.

టీడీపీలో మైనార్టీలకు అగ్రస్థానం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టీడీపీలో మైనార్టీలకు అగ్రస్థానం ఉంటుందని రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ జుబేర్ తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని హరూన్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఘనంగా సన్మానించారు. రైల్వేకోడూరు సీనియర్ నాయకులు పట్టాన్ మౌలా(అల్లాభకాష్), ఓబులవారిపల్లి మాజీ కో ఆప్షన్ సభ్యులు మస్తాన్ మరియు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీడీపీ మైనారిటీ విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి కృషి చేయండి

నందలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ ఆర్‌ఎస్ రోడ్డులో బంగ్లా శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు బీజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ బంగ్లా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ నాయకులు హిమగిరినాథ్‌యాదవ్, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య ముఖ్యమైనది

నందలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పూర్వ ప్రాథమిక విద్య ముఖ్యమైనదని కోర్సు డైరెక్టర్, ఎంఈవో-1 నాగయ్య పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఆరు రోజులుగా జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సును మండలంలోని మొత్తం అంగన్వాడీ వర్కర్లకు నిర్వహించారు. చివరిరోజు మంగళవారం పాఠశాల సంసిద్ధత మేళాను ఎంఈవో-1 నాగయ్య ప్రారంభించారు.

రూ.2 లక్షలతో పంచలోహ ఆభరణాలు

సుండుపల్లె, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ చింతలయ్యగారిపల్లె శివాలయానికి 108 కిలోల పంచలోహాలతో మకర తోరణం, త్రిశూలం, దివ్యజ్యోతులను చేయించినట్లు తిరుమల ఏజెన్సీ యజమాని వెంకటేశ్, వంశీకృష్ణలు మంగళవారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం 6 గంటలకు ఈ అభరణాలను చింతలయ్యగారిపల్లెలో వెలిసిన శివునికి పెట్టి అభిషేకాలు, పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాటి విలువ రూ.2 లక్షలు అవుతాయని దాతలు తెలియజేశారు. అలాగే అదే ఆలయంలో అదే గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వస్తున్నట్లు తెలిపారు.


పంచలోహాలతో చేసిన మకర తోరణం, త్రిశూలం దివ్యజ్యోతులు

యాచక వృత్తిలో ఉన్న ఆడ పిల్లలు చిల్డ్రన్స్ హోంకు తరలింపు

రాజంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):రాజంపేట మండలం వివిధ గ్రామాల్లో యాచక వృత్తి చేస్తున్న ఆరుగురు ఆడ పిల్లలను మంగళవారం రాజంపేట చిల్డ్రన్స్‌హోంకు తరలించారు. యాచక వృత్తి చేస్తున్నవారిని గుర్తించి చిల్డ్రన్స్‌హోంకు తరలించి పాఠశాలలో చేర్పించాలన్న కలెక్టర్ ఆదేశాలతో చిల్డ్రన్స్‌హోం సూపరింటెంటెంట్ రాజేశ్వరి స్పందించి వారిని రాజంపేట చిల్డ్రన్స్‌కు తరలించారు. రాజంపేట మండలం పెద్దకారంపల్లె పంచాయతి దుర్గాపురం ఎస్టీకాలనిలో విచారణ చేసి 5 సంవత్సరాలు ఇద్దరు ఆడ పిల్లలను, 6, 7, 8, 12 సంవత్సరాలు కలిగిన మరో నలుగురు ఆడ పిల్లలను మొత్తం ఆరుగురిని చిల్డ్రన్స్‌హోంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సీడీపీవో సుజామణి, రామలక్ష్మీ, శైలజా తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సంబేపల్లె, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం సంబేపల్లె మోడల్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి పాఠశాల వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు బంగారు భవష్యత్తుకు పదవ తరగతి పునాది లాంటిదన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్చీ నిర్మాణం గేటు తన సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కొనసాగించాలని పోస్టుకార్డు ఉద్యమం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ కొనసాగించాలంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో 200 మంది మున్సిపల్ కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వయంగా ఉత్తరాలు రాసి పోస్ట్ చేస్తూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. మంగళవారం వారు జగదాంబసెంటర్ నుంచి పోస్ట్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.


పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్న మున్సిపల్ కార్మికులు

నేడు మంత్రి మండిపల్లి రాక

రాయచోటిటౌన్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి బుధవారం ఉదయం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రానున్నారు. ఉదయం 9.15 గంటలకు మహాశివరాత్రి సందర్భంగా వీరభద్రస్వామి సేవలో మంత్రి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహిస్తారు. 10.15 గంటలకు లక్కిరెడ్డిపల్లె మండలంలోని గంగమ్మ గుడి ఆవరణంలో అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. 11.30 గంటలకు కల్పనాయునిచెరువు గ్రామంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు దిగువ అబ్బవరం కమ్మరపల్లెలోని అభయాంజేయస్వామి ఆలయంలో పూజలు చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కడప పట్టణంలో కడప వండర్ లా అమ్యూస్మెంట్ పార్క్/హోటల్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు శెట్టిపల్లి గ్రామం జంగంపల్లిలోని శివాలయంలో జరిగే శివరాత్రి మహోత్సవంలో పాల్గొంటారు.

ఏనుగుల దాడిలో మరణించిన కుటుంబాలను ఆదుకుంటాం

- మృతి చెందిన వారికి రూ.లక్ష.. గాయపడినవారికి రూ.25 వేలు
- కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వై.కోట అటవీ ప్రాంతం నుంచి తలకోనకు వెళుతున్న భక్తులపై ఏనుగులు దాడి చేయడం బాధాకరమని, మృతుల కుటుంబాలను ఆదుకుంటామని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం ప్రకటించారు. మృతిచెందిన వంకాయల దినేష్, తుపాకుల మణెమ్మ, తిరుపతి చెంగల్‌రాయుడు కుటుంబాలను ఆదుకుంటామన్నారు. అలాగే గాయపడిన వారి కుటుంబాలను ముక్కా వరలక్ష్మీ పరామర్శించారు. మృతిచెందిన ఒక్కొక్కరికి రూ.లక్ష, గాయపడిన వారికి రూ.25 వేల ఆర్థిక సాయం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా అందిస్తామని వివరించారు.

కోళ్ల ఫారాన్ని మూసివేయాలి

గాలివీడు, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): గోరాన్‌చెరువు పంచాయతీ దాసరి వాండ్లపల్లెకు సమీపంలోని అంగన్వాడీ పాఠశాలకు దగ్గరలో ఉన్న షిరిడిసాయి కోళ్లఫారాన్ని మూసివేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. మంగళవారం సర్పంచ్ దీప్తి అధ్యక్షతన ఎంపీడీవో జవహర్‌బాబు ఆధ్వర్యంలో గ్రాసభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ కోళ్లఫారం నుంచి వెలువడే వ్యర్థపదార్థాల విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మేరకు ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. కోళ్ల ఫారం యజమానికి నోటీసులు అందజేశామన్నారు. కోళ్ల ఫారం యజమాని కోర్టుకు వెళ్లడంతో కోర్టు మూడు వారాల లోపు గ్రామ సభలో తీర్మానించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. కోర్టు ఆదేశానుసారం ఈ గ్రామసభను ఏర్పాటు చేశామని, ఇందులో అత్యధిక మంది ప్రజలు కోళ్లఫారం మూసివేయాలని నినాదంతో చేతులెత్తారన్నారు. ఈ మేరకు తీర్మానించామని ఆయన పేర్కొన్నారు.


కోళ్ల ఫారానికి వ్యతిరేకంగా గ్రామసభలో చేతులెత్తిన ప్రజలు

నేషనల్ హైవేని పరిశీలించిన ఎన్‌టీసీఏ బృందం

నందలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కడప - రేణిగుంట మార్గంలో నిర్మించనున్న నూతన హైవే రోడ్డును నందలూరు ప్రాంతంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) బృందం మంగళవారం పరిశీలించింది. ఈ నేపథ్యంలో నేషనల్ అథారటి ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) వారు ప్రతిపాదించిన అండర్ పాసెస్‌లు ఏర్పాటు చేసే స్థలాలను గుర్తించారు. అటవీ ప్రాంతంలో జంతువులు రోడ్డు పైకి వచ్చి వాహనాల ద్వారా ప్రమాదానికి గురికాకుండా ఉండేందుకు ఈ అండర్ ప్రాసెస్‌లను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీసీఏ అధికారి(ఐఎఫ్‌ఎస్) హరిని, ఐఎస్ఎఫ్ యశోధభాయి, సీఎఫ్‌వో సెల్వం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిశంకర్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

చిన్నమండెం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): బోరెడ్డిగారిపల్లెవాసి వెంకట్రమణకు రూ.2.50 వేల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఆయన అనారోగ్యంతో తిరుపతిలోని గంటా న్యూరో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఇతన్ని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. అతని ఆర్థిక పరిస్థితి తెలుసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి డబ్బు మంజూరు చేయించారు.

చిట్వేలిలో ఎన్‌సీసీ ఉత్తీర్ణత ధ్రువపత్రాల పంపిణీ

చిట్వేలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఎన్‌సీసీఏ సర్టిఫికెట్ ఉత్తీర్ణత పత్రాలను ప్రధానోపాధ్యాయుడు ఏబీఎస్ ప్రసాద్ అందజేశారు. ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ 2022-24 బ్యాచ్ ఎన్‌సీసీ క్యాడెట్లు 2024 జనవరిలో పరీక్షకు 41 మంది హాజరు కాగా 37 మంది ఏ గ్రేడ్‌లు, నలుగురు బి గ్రేడ్‌లు పొంది 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.


ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం ప్రసాద్, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్

మిట్స్ ఎంవోయూ ఒప్పందం

కురబలకోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అమెరికాకు చెందిన బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీతో ఎంవోయూ ఒ ప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఆ యూనివర్శిటీ ప్రతినిధులు రామ్, ప్రోవోస్ట్, మొ ఖ్తార్, జాన్, కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్‌లు ఆ యూనివర్శిటీతో సంతకాలు చేసి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాల్లో సహాయ సహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలనే దానిపై సలహాలు, సూచనలు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ తులసీరామ్‌నాయు డు, ఇంటర్నేషనల్ రిలేషన్ మేనేజర్ విజయక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


యూనివర్సిటీతో ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు

లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్లు వితరణ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ యాక్సిస్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం లక్కిరెడ్డిపల్లె పోలీసు స్టేషన్‌కు 20 బారికేడ్లు, 10 కుర్చీలు ఎస్ఐ రవీంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు తిరుపతి ఎండీ జగదీష్ ఏరియా మేనేజర్ గిరిబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు అవి ఉపయోగప డతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

పెనగలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎన్.గురుమూర్తి అనారోగ్యంతో మృతిచెందినట్లు ఎస్ ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. 2023లో మే 4న ఆయన పెనగలూరు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. మూడు రోజులు కిందట తీవ్రమైన అనారోగ్యానికి గురికావడంతో స్వగ్రామం ఖాజీపేటకు సెలవుపై పంపించగా మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారన్నారు.మంగళవారం ఖాజీపేటలో అంత్యక్రియలు జరిగినట్లు ఆయన తెలిపారు.


గురుమూర్తి (ఫైల్)

ఆకేపాటా.. మజాకా...!


ఆకేపాటి అమరనాథరెడ్డికి సంబంధించిన ఆకేపాటి ఎస్టేట్ ముఖద్వారం

- అది అల్లాటప్పా ఎస్టేట్ కాదు..
- వేరే లెవెల్.. సకల సౌకర్యాలు అక్కడే..
- దర్జాగా ప్రభుత్వ భూములు కబ్జా
- ఆపై అక్రమంగా రిజిస్ట్రేషన్లు.. విలాసవంతమైన నిర్మాణాలు
- అక్రమాల నిగ్గు తేల్చేందుకు రంగంలోకి రెవెన్యూ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తన కుటుంబ సభ్యుల పేరుతో సుమారు 57 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమించారని రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి గత ఏడాది అక్టోబరులో ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదుపై విచారణ చేశారు. ఇందులో అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా ప్రభుత్వ భూమి (గయాలు భూమిని) ఆన్‌లైన్ చేయించుకున్నట్లు నిర్ధారించారు. అంతే కాకుండా ఆ భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయించినట్లు.. భర్త భార్యకు.. భార్య భర్తకు.. అన్న తమ్మునికి.. తమ్ముడు అన్నకు.. ఇలా మొత్తం అన్ని ఎకరాలనూ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం విశేషం. కనీసం డీకేటీ పట్టాలు ఇచ్చిన భూములు కూడా కాని.. ప్రభుత్వ భూములను అధికారులు కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్లు చేసేయడం మరీ దుర్మార్గం.

అడంగల్, వన్‌బీలో నమోదు

ఆకేపాటి అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు రాజంపేట మండలం మందపల్లె, ఆకేపాడు గ్రామాలలో అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మందపల్లె గ్రామంలో బ్లాక్ సర్వే నెంబరు 553లో ఉన్న 1905.60 ఎకరాలను భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేసేందుకు ప్రభుత్వం ముక్కలుగా విభజించింది. ఇందులో ప్రభుత్వ లెక్కల ప్రకారం 25.05 ఎకరాలు అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇందులో 563 సర్వే నెంబరు పట్టా భూమి. ఆకేపాడు గ్రామంలో 56 సర్వే నెంబరులో 20.10 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం ముక్కలుగా విభజించింది. ఇందులో 56/1లో 5 ఎకరాలు, 56/8లో 5.68 ఎకరాలు, 56/9లో 2.35 ఎకరాలు కలిపి 13.03 ఎకరాలను అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు ఆన్‌లైన్ చేసుకున్నారు. ఈ భూమిని ప్రభుత్వం ఎవరికీ అసైన్‌మెంటు కింద ఇవ్వలేదు.

కుటుంబ సభ్యుల పేర్లతో ఆన్‌లైన్..

మందపల్లె గ్రామంలో.. ఆకేపాటి జ్యోతమ్మ, భర్త ఆకేపాటి అమరనాథరెడ్డి పేరు మీద (ఖాతానంబరు 704) 814/3లో 4 ఎకరాలు, ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి పేరు మీద (ఖాతానంబరు 277) 814/4లో 5 ఎకరాలు, ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి పేరు మీద (ఖాతానంబరు 705)లో 815/1లో 3.79 ఎకరాలు, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి ఎ.ఎల్.ఎన్.నారాయణరెడ్డి పేరు మీద (ఖాతానంబరు 707) 815/2లో 5 ఎకరాలు, 816/2లో 4.31 ఎకరాలు.. ఆకేపాడు గ్రామంలో ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్ రెడ్డి పేరుమీద (ఖాతా నంబరు 1213) సర్వేనంబరు 56/8లో 5.68 ఎకరాలు, ఆకేపాటి జ్యోతమ్మ భర్త అమరనాథరెడ్డి పేరు మీద (ఖాతా నెంబరు 1212) 56/9లో 2.35 ఎకరాలు ఆన్‌లైన్ అక్రమంగా చేయించుకున్నారు.

ప్రైవేటు పాఠశాల, స్విమ్మింగ్ పూల్, గుర్రపుశాల



ఇలా అక్రమంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాలలో ఆకేపాటి కుటుంబం ఓ ప్రైవేటు పాఠశాల, స్విమ్మింగ్‌పూల్, గుర్రపుశాలను నిర్మించుకుంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారు. ఆ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పుడు పాఠశాల గదులుగా మారిపోయాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆ పాఠశాలకే ఆకేపాటి అమరనాథరెడ్డి పాఠశాలగా నామకరణం చేశారు. తమ సొంత నిధులతో పేదలకు ఉచిత విద్యాబోధన చేస్తున్నట్లు పైకి కనిపిస్తున్నారు. ఇక్కడే వైసీపీ కార్యకర్తల కోసం సమావేశ మందిరం, జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు క్యాంపు కార్యాలయం ఉన్నట్లు సమాచారం. ఈ విలాసవంతమైన ఎస్టేట్‌లో ఎన్నో రకరకాల జంతువులు, చిలుకలు, పిట్టలు ఇలా ఎన్నెన్నో మూగజీవాలు ఉన్నాయి. ఇక్కడే పశువుల పాక, అన్నింటికి మించి గుర్రపుశాల, అందులో రేసు గుర్రాలు, ఎస్టేట్‌ను కాపలా కాసే రేసు కుక్కలు, ఉద్యానవన పంటలు ఇలా.. ఎన్నెన్నో ప్రత్యేకతలు ఇక్కడ ఉన్నాయి. ఈ ఎస్టేట్ ఆనుకుని ఆలయాల సముదాయం పక్కన పేదల కోసం ఓ కల్యాణమండపాన్ని ఏర్పాటు చేశారు. అయితే అక్కడ కల్యాణమండపానికి ఉన్న రూములు కూడా ఇందిరమ్మ ఇళ్లే అని పలువురు పేర్కొంటున్నారు. ఈ ఎస్టేట్ ప్రధాన ముఖద్వారం వద్ద పదుల కొద్దీ అటు ఇటు వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రభుత్వ భూమిలో కట్టడం విశేషం. ఆకేపాటి ఎస్టేట్‌లోని ప్రైవేటు భవనానికి చుట్టుపక్కల ప్రభుత్వ, జడ్పీ నిధులతో భారీఎత్తున సిమెంటు రోడ్లు నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి.


ఇందిరమ్మ ఇళ్లలో ప్రైవేటు పాఠశాల

అక్రమంగా రిజిస్ట్రేషన్లు

సాధారణంగా ప్రభుత్వ, డీకేటీ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కుదరదు. నిషేధిత భూముల జాబితాలో ఉంటాయి. అయితే అమరనాథరెడ్డి కుటుంబసభ్యులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను రాజంపేటలో రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 మే 6 నుంచి 10వ తేదీ లోపు ఈ రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఇందులో పైన ఆన్‌లైన్ చేయించుకున్న వాళ్లందరూ.. భార్యలు భర్తల పేరు మీద.. భర్తలు భార్యల పేరు మీద, అన్న తమ్ముడు పేరుమీద.. తమ్ముడు అన్న పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం.. ఈ అక్రమాలలో హైలైట్.

మందపల్లె గ్రామంలో ఆకేపాటి జ్యోతమ్మ తన భర్త అమరనాథరెడ్డికి సర్వేనంబరు 814/3లోని నాలుగు ఎకరాలను డాక్యుమెంటు నెంబరు ద్వారా 1773/2023 అమ్మేశారు. సర్వే నెంబరు 814/4 ఐదు ఎకరాలను ఆకేపాటి సుజన తన భర్త అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు నెంబరు 1768/2023 ద్వారా అమ్మారు. సర్వే నెంబరు 815/1 3.79 ఎకరాలను ఆకేపాటి సుజన తన భర్త అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు 1767/2023 ద్వారా అమ్మారు. సర్వే నెంబరు 815/2లో ఐదు ఎకరాలు ఆకేపాటి అమరనాథరెడ్డి తన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డికి డాక్యుమెంటు నెంబరు 1774/2023 ద్వారా అమ్మేశారు. 816/2లో 4.31 ఎకరాలను ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తన భార్య సుజనకు డాక్యుమెంటు నెంబరు 1770/2023 అమ్మారు. ఆకేపాడు గ్రామంలో సర్వే నెంబరు 56/8లో 5.68 ఎకరాలను ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తన భార్య సుజనకు డాక్యుమెంటు నెంబరు 1769/2023 ద్వారా అమ్మారు. 56/9లో 2.35 ఎకరాలను ఆకేపాటి అమరనాథరెడ్డి తన భార్య జ్యోతమ్మకు డాక్యుమెంటు 1772 ద్వారా అమ్మేశారు.

సర్వే నెంబరు 553ను పంచుకున్న ఆకేపాటి కుటుంబం

సర్వే నెంబరు 553లో 1,905.60 ఎకరాల భూమి ఒక బ్లాకుగా ఉంది. పేదలకు భూమి పంచేందుకు ప్రభుత్వం చేపట్టిన సబ్‌డివిజన్ ఆకేపాటి కుటుంబానికి వరంలా మారిందనే చెప్పవచ్చు. ఈ సర్వే నెంబరు ముక్కలుగా విభజించిన తర్వాత.. ఏర్పడిన 810 సర్వే నెంబరులో 8.46 ఎకరాలు ఆకేపాటి చిన్నమ్మ (భర్త రాజగోపాల్‌రెడ్డి), 811లో 7.48 ఎకరాలు ఆకేపాటి కార్తీక్‌రెడ్డి (తండ్రి రంగారెడ్డి), ఆకేపాటి శశాంక్ గోపాల్ రెడ్డి (తండ్రి రంగారెడ్డి) పేరుతో 7.5 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు. పై రెండు ప్రభుత్వ భూములు, 812/1లో 5 ఎకరాలు ఆకేపాటి అనసూయమ్మ భర్త లక్ష్మీవెంకట నారాయణరెడ్డి, 812/3లో 2.45 ఎకరాలు ఆకేపాటి అనసూయమ్మ భర్త ఆకేపాటి లక్ష్మీవెంకటనారాయణరెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తండ్రి ఆకేపాటి లక్ష్మీ వెంకట నారాయణరెడ్డి 2.45 ఎకరాలు ఆన్‌లైన్ చేయించుకున్నారు. 814/3లో ఆకేపాటి జ్యోతమ్మ భర్త అమరనాథరెడ్డి నాలుగు ఎకరాలు, 814/4లో ఐదు ఎకరాలు ఆకేపాటి సుజన భర్త అనిల్‌కుమార్‌రెడ్డి, 815/1లో ఆకేపాటి సుజన 3.79 ఎకరాలు, 815/2లో ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ఐదు ఎకరాలు, 816/2లో ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి 4.31 ఎకరాలు ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇవి జిరాయితీ పట్టా భూములు. సర్వే నెంబరు 847/7లో గయాలు భూమి ఆకేపాటి రేణుక పేరు మీద 1.57 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు.

నిగ్గు తేల్చేందుకు రంగంలోకి రెవెన్యూ..

టీడీపీ మండల అధ్యక్షుడి ఫిర్యాదుతో.. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో.. జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆకేపాటి ఎస్టేట్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు రంగంలోకి దిగింది. ఇప్పటికే ఇక్కడ జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో సమాచారాన్ని సేకరించి.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వాళ్లకు నోటీసులు పంపించింది. అయితే జిల్లా జాయింట్ కలెక్టర్ ఇచ్చిన నోటీసుల మీద ఆకేపాటి కుటుంబం రాజంపేట సివిల్ జడ్జి కోర్టులో 3/2025, 4/2025, 5/2025 6/2025 నెంబర్లతో సూట్ దాఖలు చేశారు. జాయింట్ కలెక్టర్ ఇచ్చిన నోటీసులపైన తమకు అనుకూలంగా పర్మినెంట్ ఇంజక్షన్ కోసం సూట్ వేసినట్లు సమాచారం.


ఆకేపాటి ఎస్టేట్ ఆనుకుని ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న కల్యాణమండపం


- ఆకేపాటి ఎస్టేట్‌లోని గుర్రపుశాల

'తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడండి'


సీడబ్ల్యూసీ స్కీంను పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ


సిద్దవటం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని పంచాయతీ నిధుల్లో ఎక్కువ శాతం తాగునీటి సరఫరాకు వినియోగించాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ ఆదేశించారు. మండలంలోని మాధవరం గ్రామం లో సీపీడబ్ల్యూ స్కీంను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అం దించేందుకు వాడాలని, ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని, పైపుల లీకేజీలు తనిఖీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, శానిటేషన్ పనులు నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మెహతాజ్‌యాస్మిన్, ఆర్‌బ్ల్యూసీ డీఈ కిరణ్‌కుమార్, ఏఈ గులురాజు ప్రసాద్, పంచాయత సెక్రటరి లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

విషపు మొక్కలు తిని 20 మేకలు మృతి


మృతిచెందిన మేకలను పరిశీలిస్తున్న పశు వైద్యుడు

సిద్ధవటం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విషపు మొక్కలు తిని 20 మేకలు మృతి చెందాయని పశువైద్యాధికారి శివశంకర్ తెలిపారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ మిట్టపల్లె గ్రామానికి చెందిన ఓబయ్య మంగళవారం తన మేకలను గ్రామ సమీపంలోని పంట పొలాల్లోకి మేతకు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం ఇంటి దగ్గర మేకలు నీళ్లు తాగిన అనంతరం కొద్ది సేపటికే 20 మేకలు మృతిచెందాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన మేకల విలువ 2 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. మృతి చెందిన మేకలను పశువైద్యాధికారి డాక్టర్ శివ శంకర్ పరిశీలించారు. నమూనాలు సేకరించి కడప వెటర్నరి వైద్యశాల ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషపు మొక్కలు తినడం తోనే మేకలు మృతిచెందినట్లు ల్యాబ్ పరీక్షలో తేలిందని, రైతుకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆయన అన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..


కుమార్ మృతదేహం

ములకలచెరువు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురకాయలకోట సమీపంలో మంగళవారం ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు...దేవళచెరువు పంచాయతీ మావిళ్ల వారిపల్లెకు చెందిన కుమార్ (58) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అతిగా మద్యం సేవించేవాడు. ఇతని భార్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం తెల్లవారుజామున బురకాయల కోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం సమీపంలోని జాతీయ రహదారి పక్కనే అతని మృతదేహం కనిపించింది. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే, వృద్ధుడి ముఖానికి ఒక వైపు తీవ్ర గాయాలు ఉండడంతో అతని మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

షటిల్ కోర్టు వద్ద గుండెపోటుతో..

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): షటిల్ ఆడిన అనంతరం విశ్రాంతి తీసుకుంటుండగా గుండెపోటు రావడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మదనపల్లె పట్టణం సుభాష్‌రోడ్డుకు చెందిన సుబ్రహ్మణ్యం (53) వేరుశనగ వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం ఉదయం షటిల్ ఆడిన కొద్ది సేపటికి గుండెపోటు రావడంతో కుప్పకూలి పోయాడు, వెంటనే మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 20 ఏళ్లగా షెటిల్ ఆడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు

కలెక్టరేట్‌కు ఏసీబీ భయం!

- తలుపులు వేసుకుని విధుల నిర్వహణ
- ఇతరులను అనుమతించవద్దని ఆదేశాలు
- అటెండర్ల సాయంతో పర్యవేక్షణ

రాయచోటి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చేనేత, జవుళి శాఖ ఏడీ కృష్ణ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో కలెక్టరేట్ ఉలిక్కిపడింది. దీంతో జిల్లా అధికారులు సోమవారం సాయంత్రం 6 గంట ల నుంచి 8 గంటల వరకు కలెక్టరేట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ఎవరినీ కార్యాలయం లోపలికి రానివ్వరాదంటూ ఆదేశాలిచ్చినట్లు సిబ్బంది చెప్తున్నారు. కాగా, ఎవరో.. ఏదో తప్పు చేసి ఏసీబీ వారికి పట్టుబడితే కలెక్టరేట్ సిబ్బంది ఎందుకు భయపడుతున్నారని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టరేట్‌లోని కొన్ని విభాగాల్లో పైసలు ఇవ్వకుంటే ఫైలు కదలడం లేదన్న ఆరోపణలు వినిపిస్తుండడం తో అన్నమయ్య కలెక్టరేట్‌పై ఏసీబీ నిఘా ఉంచి నట్లు ప్రచారం సాగిందని గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు చెబు తున్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో కింది స్థాయి సిబ్బందిని పిలిచి హెచ్చరించారు. ప్రస్తుతం తలుపులు వేసుకుని ఉద్యోగులు విధులు నిర్వహించడం చూస్తుంటే చేస్తుంటే.. అధికారులు మళ్లీ పూర్వం లాగే మామూళ్ల కోసం ప్రజలను పీడిస్తున్నారేమో అని ప్రజలు సందేహిస్తున్నారు. ఈ విషయంలో రాజంపేట డివిజన్‌కు సంబంధించిన ల్యాండ్ సెక్షన్, రాయచోటి డివిజన్ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారుల పేర్లు కలెక్టరేట్‌లో మారు మోగుతున్నాయి. ఇది ఇలా ఉండగా కలెక్టర్ కార్యాలయంలోకి ఎవరికీ అనుమతి లేదని, అటెండర్‌తో సంకేతాలు పంపిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది అవినీతికి పాల్పడకుంటే, తలుపులు ఎందుకు వేసుకుంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.


మూసి ఉన్న అడ్మినిస్ట్రేషన్ విభాగం తలుపులు

గృహాల కోసం 35 వేల దరఖాస్తులు

- హౌసింగ్ పీడీ సాంబశివయ్య


సమీక్ష సమావేశంలో పీడీ సాంబశివయ్య

పీలేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గృహాల కోసం 34,757 దరఖాస్తులు అందినట్లు హౌసింగ్ పీడీ సాంబశివయ్య తెలిపారు. పీఎంఏవై-ఎన్టీఆర్ 2.0 కాలనీల పురోగతిపై మంగళవారం ఆయన పీలేరులోని హౌసింగ్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 9,727 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 11,243 గృహాల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లబ్ధిదారులను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. వీరికి గతంలో ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చేనేత కార్మికులకు రూ.50 వేలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం లబ్దిదారులకు వారానికి రెండు సార్లు బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో లబ్దిదారుల ఖాతాల్లో బిల్లులు జమ చేస్తున్నామన్నారు. పీలేరు నియోజకవర్గంలోని లేఔట్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.2.84 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. లబ్ధిదారులు ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని తమ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలన్నారు. అనంతరం ఆయన మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురగోతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పీలేరు డీఈ రమణయ్య, ఏఈ చంద్రశేఖర రెడ్డి, ఎంఐసీలు హరిబాబు, నాదముని నాయక్, సొహైల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'మామిడి మొక్కలు తొలగిస్తాం'


ఆక్రమిత ప్రదేశంలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

సుండుపల్లె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గుట్టలు ఆక్రమించి నాటిన మామిడి చెట్లు తొలగిస్తామని వీఆర్‌వో చిట్టిబాబు తెలిపారు. ఈ నెల 19న 'గుట్టను గుల్ల చేశారు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ దైవాదీనం స్పందించారు. ఆర్ఐ శ్రీనివాసులునాయక్, సర్వేయర్ సుబ్బరాయుడు కొత్తపల్లి సమీపంలో గుండాలొంక, మొరంగుట్టలను సర్వే చేసి సుమారు ఒక ఎక రా 50 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి హద్దులు ఏర్పా టు చేసి బోర్డు నాటారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి మామిడి చెట్లు తొలగిస్తామని వీఆర్వో తెలిపారు. గుట్టలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతి లేకుండా అడవిలోకి వెళితే చర్యలు

- జిల్లా అటవీశాఖ అధికారి ఆర్. జగన్నాథ్‌సింగ్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వై.కోట గుండాలకోనలో ఉత్సవాలను రద్దు చేయడంతో పాటు, అక్కడికి వెళ్లేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఆర్. జగన్నాథ్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనుమతి లేకుండా రిజర్వు ఫారెస్టులోకి వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణులు నీరు, ఆహారం సరిగా లేక ఆకలితో ఉంటాయని. వాటిని రెచ్చగొడితే ప్రాణాలు పోతాయన్నారు. ప్రజలు అనుమతి లేకుండా అడవి లోకి వెళితే ప్రాణా లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గుండాలకోనకు వెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రైల్వేకోడూరు ఐఎఫ్ఎస్ అధికారి సుబ్బరాజు, రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు రద్దు

ఓబులవారిపల్లె : ఏనుగుల దాడి నేపథ్యంలో వైకోట గుండాల కోనలో శివరాత్రి ఉత్సవాలను రద్దు చేసినట్లు తహసీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో మల్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ తెలిపారు. వై.కోట రిజర్వు ఫారెస్టులో ఉన్న గుండాల నీలకంఠేశ్వరస్వామి కోనకు భక్తులు వెళ్లడానికి అనుమతి రద్దు చేసినట్లు వివరించారు. దారి తప్పిన ఏనుగుల కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

వివాదాస్పదంగా వాలీశ్వరాలయ అర్చకుల నియామకం

రామసముద్రం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలసముద్రం గ్రామ సమీపంలో ఉన్న వాలీశ్వరస్వామి ఆలయ ప్రధాన పూజారి నియామకంపై వివాదం నెలకొంది. ఈ ఆలయంలో బలసముద్రం గ్రామానికి చెందిన లోకనాథం ప్రధాన పూజారిగా పని చేసేవాడు.. గత ఏడాది శివరాత్రి పండుగ సందర్భంగా ఆలయ నిర్వాహకులకు, పూజారి లోకనాథంకు మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడ్డాయి. దేవదాయ శాఖ అనుమతి లేకుండా ఆలయ భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించాడని, ఆలయ భూములను సాగు చేసుకుంటూ కౌలు చెల్లించడం లేదని, శివరాత్రి సందర్భంగా భక్తులు చెల్లించే కానుకలకు జమ ఖర్చులు చూపించడం లేదని సుమారు పద్దెనిమిది కుటుంబాల వారు ఆరోపణలు చేశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో పోలీసులు బలసముద్రం గ్రామస్తులపై కేసు నమోదు చేసి ఆలయానికి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఈ వ్యవహారంలో అప్పటి వైసీ పీ ప్రజా ప్రతినిధి తో పూజారి చేతులు కలిపాడనే విమర్శలున్నాయి. ఈ ఏడాది శివరాత్రి ఉత్సవాలకు బలసముద్రం గ్రామస్తులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయ కమిటీ వేశారు. ఈ కమిటీ లోకనాథంతో పాటు మరికొందరిని పూజారులుగా నియమించుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పూజారి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు కమిటీ నిర్ణయాన్ని ఆమోదిస్తూ ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆలయ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లోకనాథం స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దార్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు, దేవదాయ శాఖ ఈవో రమణ, సీఐ సత్యనారాయణ, స్థానిక ఎస్ఐ, రెవెన్యూ అధికారులు ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

● పండ్లతోటలను నాశనం చేస్తున్న గజరాజులు
● భయాందోళనలో అటవీ శివారు గ్రామాల ప్రజలు

భయం..భయం



ఏనుగుల దాడి సంఘటనతో ముగ్గురు మృతి చెందిన విషయం మంగళవారం కలకలం రేపింది. దీంతో అటవీ శివారు గ్రామాలకు చెందిన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ట్రెంచ్‌లు దెబ్బతిన్నాయి



మామిడి తోటల సమీ పంలో గతంలో ఉన్న ట్రెంచ్‌లు దెబ్బ తిన్నాయి. దీంతో ఏనుగులు తోటల్లోకి వచ్చేస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు తెలియ చేసినా పట్టించు కోలేదు.

- నాగినేని వెంకటరమణ, శెట్టిగుంట ఆదర్శ రైతు

ఏనుగులను కట్టడి చేయాలి



ఏనుగులు రాకుండా కట్టడి చేయాలి. లేదంటే పెద్ద ప్రమాదం జరిగే అవకాశా లు ఉన్నాయి. అటవీశాఖాధికారు లు, ప్రభుత్వం కలసి ఉమ్మ డిగా చర్చలు జరిపి తగు నిర్ణయాలు తీసుకోవాలి.

- ఈశ్వరయ్య, వై.కోట సర్పంచ్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అటవీ శివారు గ్రామాలైన ఇందిరానగర్, శివాజీనగర్, కన్నెగుంట గిరిజన కాలనీ, కుక్కలదొడ్డి, వాగేటికోన, దేశెట్టిపల్లె తది తర గ్రామాల ప్రజలు కూలీ పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు నిత్యం వ్యవసాయ రైతు కూలీ పనులకు వెళుతుంటారు. పొలాల్లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ప్రతి ఏటా ఏనుగుల గుంపు ఉద్యాన పంటలైన మామిడి, అరటి, బొప్పాయి పంటలను నాశనం చేస్తున్నాయి. అడవిలో నీరు, ఆహారం అతి తక్కువగా ఉండడమే ఇందుకు కారణం అని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. గతంలో కర్ణాటక రాష్ట్రంలో ఏనుగులు రాకుండా ఉండడానికి సోలార్ ట్రెంచ్‌ని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. అయితే అక్కడ అది ఫలితాలు చూపించక పోవడంతో ఇక్కడ ఏర్పాటు చేయలేకపో యారు. అయితే అటవీశాఖాధికారులు అడవి చుట్టూ గతంలో ట్రెంచ్‌లు తీయగా స్మగ్లర్ల ధాటికి కొన్ని దెబ్బతినగా మరికొన్ని వర్షాలకు కుంగిపోయాయి. శెట్టిగుంట, బిల్లుపాటిపల్లె, కొత్తపల్లె, జానకీపురం తది తర ప్రాంతాల్లో పండ్ల తోటలను ప్రతి ఏటా నాశనం చేస్తున్నాయని రైతులు పలుమార్లు అధికారులకు విన్న వించినా ఏనుగుల కట్టడికి ఇంతవరకు పటిష్టమైన చర్యలు తీసుకోలేదు.

గతంలో ఏనుగుల దాడులు...

ఐదేళ్ల క్రితం శెట్టిగుంట పంచాయతీ పరిధిలోని లక్ష్మీ గారిపల్లెకు చెందిన ఓ వ్యక్తి మామిడి తోటలో ఉండ గా ఏనుగు దాడి చేసి గాయపరిచింది. పీలేరు మండ లంలోని కాకులారంపల్లె పంచాయతీలోని బందార్ల పల్లెకు చెందిన మోపిరెడ్డి చిన్నరాజారెడ్డి గత ఏడాది అక్టోబరు 15వ తేదీ తన ఆవులను మేతకు తోలు కెళ్లగా ఏనుగులు దాడి చేయడంతో మృతి చెందాడు.

ఇబ్బంది కలిగితే దాడి చేస్తాయి



సహజంగా ఏనుగులు పగటి పూట ప్రయాణం చేస్తాయి. రాత్రివేళలో ఆహారం తీసుకుం టాయి. ఆహారం తీసుకునే సమయంలో వాటికి ఇబ్బంది కల్గిస్తే అవి దాడులు చేస్తా యి. పిల్లలతో కలిసి వెళుతుం టాయి. చప్పుళ్లు చేస్తే అవి అసహనానికి గురై దాడి చేస్తాయి.

- నాగేశ్వర్‌నాయక్, ఎఫ్‌బీవో, వై.కోట



శెట్టిగుంట ప్రాంతంలో దెబ్బతిన్న ట్రెంచ్

జాతీయ హాకీలో మహిళలు సత్తా చాటాలి



జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర మహిళా జట్టు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ పోటీల్లో మహి ళల రాష్ట్ర జట్టు సత్తా చాటాలని నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీవో) ఆర్‌కే.యతిరాజ్ అన్నారు. నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మహిళల హాకీ రాష్ట్ర జట్టు శిక్షణ ముగింపు మంగళవారం జరి గింది.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏసీ స్టేడియంలో ఇటీవల జరి గిన రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన వివిధ జిల్లాల క్రీడాకారిణిలు జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి తర్ఫీదునిచ్చామన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారిణిలు ఉత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి, హర్యానాలో మార్చి 1 నుంచి 12 వరకు జరిగే జాతీయ పోటీల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం రాష్ట్ర జట్టుకు ఎంపికైన రమ్య(శ్రీకాకుళం), మేరీభవానీ కుసుమ(అనకాపల్లి), లక్ష్మీ రేవతి(అనంతపురం), వరాలమ్మ నందిని(కాకినాడ), కళ్యాణి (విశాఖప ట్నం), పావని (సత్యసాయి), హారతి నందిని(కడప), దుర్గాభవాని (ఎన్‌టీ ఆర్), రుక్మిణి(తిరుపతి), ప్రగతిశ్రావణి(నెల్లూరు), ముజియబేగం (ప్రకా శం)లను ప్రత్యేకంగా అభినందించి, క్రీడాదుస్తులను, పరికరాలు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మద్యం దుకాణం యజమాని మృతి



మధుసూదన్ నాయుడు (ఫైల్)

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తికి చెందిన తిప్పలూరు మధు సూదన్ నాయుడు(49) సోమవారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఎర్రగుంట్లలో మధు వైన్స్ నిర్వ హిస్తు న్నాడు.

రాత్రి పనులు ముగించు కుని ఇంటికి బయలుదేరాడు. పోట్లదు ర్తిలో ఎన్‌టీ ఆర్ కాలనీ వద్ద ట్రాక్టర్ ఢీకొన డంతో తలకు తీవ్ర గాయాల య్యాయి. బంధువులు చికిత్స నిమిత్తం ప్రొద్దుటూ రు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ గురుశేఖర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయు డుకు మధు సమీప బంధువు కావడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

మరో వారం రోజులు ప్యాసింజర్ రైళ్ల రద్దు

ములకలచెరువు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ములకలచెరువు మీదుగా గుంతకల్లుకు నడిచే నాలుగు ప్యాసింజర్ రైళ్ల రద్దును మరో వారం రోజులు పొడిగిస్తూ రైల్వేశాఖ ఉన్నతా ధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్గంలో తిరుగుతున్న నాలుగు రైళ్లను ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు మళ్లిం చిన విషయం విదితమే.

గత ఏడాది డిసెంబరు 18 నుంచి రెండు నెలల పాటు ఈ మార్గంలో నడిచే తిరుపతి-గుంతకల్లు జంక్షన్, గుంతకల్లు జంక్షన్-తిరుపతి ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఉదయం నడిచే తిరుపతి-గుంతకల్లు జంక్షన్‌కు, రాత్రి నడిచే గుంతకల్లు-తిరుపతి రైళ్లు మార్చి 7,8వ తేదీల నుంచి యథావిధిగా నడుస్తాయని రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బండలాగుడు పోటీల్లో సత్తా చాటిన కడప జిల్లా ఎద్దు

● మొదటి మూడు స్థానాలు కైవసం



గండవరంలో జరుగుతున్న ఎడ్ల బండలాగుడు పోటీలు

కొడవలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ వరంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం గంగా పార్వతి సమేత ఉదయకాళేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నెల్లూరు నగర టీడీపీ పరిశీలకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిలు ప్రారంభించారు. వీటిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒంగోలు, బాపట్ల, చిత్తూరు, కడప జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో గండ వరం వీధులు కిక్కిరిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 9 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహు మతి రూ.లక్షను కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దొరసాల గురవారెడ్డికి చెందిన ఎడ్లు కైవసం చేసుకోగా రెండు, మూడు స్థానాల్లో కడప జిల్లా మైదుకూరు చెందిన వెంకటేష్, కుర్ర వెంక టేష్, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో బాపట్ల జిల్లాకు చెందిన సాయిగణేష్, మారుమూల సుబ్బారెడ్డి, బాపట్ల వీరస్వాముల ఎడ్లు దక్కించుకున్నాయి. విజేతలకు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి బహుమతులు అందజేశారు.

బ్రౌన్ గ్రంథాలయ ఉనికిని నలుమూలలకు వ్యాప్తి

● వైవీయూ ఉప కులపతి ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు



వైవీయూ ఉప కులపతిని సత్కరిస్తున్న సీపీ బ్రౌన్ సిబ్బంది

కడప కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని పాఠకులకు, సాహితీవేత్తలకు మరింత చేరువ చేసేలా కృషి చేసి.. తద్వారా సంస్థ ఉనికిని నలుమూలలా వ్యాప్తి చేస్తామని యోగివేమన విశ్వవిద్యాల యం ఉప కులపతి ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు అన్నారు. వైవీయూ ఉప కులపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి మంగళవారం ఆయన బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పనిచే స్తున్న సిబ్బంది ఎవరెవరు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో ఉప కులపతికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రౌన్‌చేసిన సాహిత్య కృషిని కొనియాడారు. పనిచేస్తున్న సిబ్బంది కృషిని అభినందించారు. ప్రధానంగా కేంద్రంలో తాళపత్ర గ్రంథాలను, రాత ప్రతులను భద్రపరచి పరిశోధకులకు అందుబాటులో ఉంచడం హర్షణీయమ న్నారు. భవిష్యత్తులో గ్రం థాలయ అభివృ ద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య .జి. పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పరిశోధనా కేంద్రం సిబ్బంది ఆయనను సత్కరిచారు.

శివుని ప్రతిరూపాలు..మల్లయ్యదార్లు

● శివరామ స్మరణతో గ్రామాల్లో భిక్షాటన
● నేడు మల్లయ్యకొండకు..

మదనపల్లె/తంబళ్లపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నల్లటి దుస్తులు..త లపై ఎలుగుబంటి చర్మంతో తయారు చేసిన కుచ్చుల టోపీ.. భుజాన నల్లటి కంబళి..కాళ్లకు గవ్వల పట్టెడ.. మెడలో రుద్రాక్షలు..బండారు తిత్తి, ఒక చేతిలో ఢమరుకం..మరో చేతిలో పిల్లనగ్రోవి పట్టుకుని, నుదుటిన విభూది దిద్దుకుని కనిపిస్తారు మల్లయ్యదారులు. శివునికి ప్రతిరూపాలుగా చెప్పుకునే వీరు మహాశివరాత్రి నాడు త్రిశూలం చేత బట్టి శివదండం పఠిస్తూ పల్లెల్లో ప్రత్యక్షమవుతారు. శివపార్వతుల కథ చెబుతూ పర్యటిస్తారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన భ్రమ రాంబ మల్లికార్జునస్వామి ప్రాశస్త్యాన్ని పాటలు, పద్యాల రూపంలో వివరిస్తూ భిక్షాటన చేస్తారు.

శివరాత్రికి రెండునెలలకు ముందు వీరు మల్లయ్య దీక్ష స్వీకరిస్తారు. అనంతరం కాలినడకన గ్రామాలకు వెళ్లి శివరాత్రి పండుగ వస్తోందని ప్రజలకు గుర్తుచేస్తారు. వారి నుంచి భిక్ష స్వీకరి స్తారు. గతంలో వీరికి గౌరవంగా దేవకానుక, రాజకానుక, గుడికానుక, గురుకానుక, ఇంటి కానుక పేరుతో నగదు, ధాన్యం తదితరాలు ఇచ్చే వారు. తర్వాతి కాలంలో రైతులు దేవర పంటగా తీసే వరి ధాన్యంతో పాటు బెల్లం, కందిబేడలు, ఆవునెయ్యి ఇచ్చేవారు. పంటలు పండి ధాన్యం ఇంటికి వచ్చే కాలం కావడంతో రైతులు ఆత్మీయంగా ఇచ్చే కానుకలే వీరికి జీవనాధారంగా ఉండేవి. గ్రామాల్లో భిక్షాటన చేస్తూ పండుగ నాటికి కొండపైకి చేరుకుని భిక్షాటన ద్వారా సేకరించిన కాను కలు, ఇతర సామగ్రిని హుండీలో లేదా అన్నదానానికి ఖర్చు చేసేవారు.

ఎనిమిది మంది ఉన్నాం

ములకలచెరువు మండలం ఎద్దులవారిపల్లె, చిన్నమండెం మండలం కేశాపురం, వండాడి గ్రామాల్లో 30 కుటుంబాల్లో ఇంటికొ కరు చొప్పున ప్రతిసంవత్సరం శివదీక్ష స్వీకరించే వాళ్లం. ప్రస్తుతం ఎనిమిది మంది మాత్రమే మిగిలినాం. ఈ తరంలో మేమే చివరి వాళ్లం అనిపిస్తోంది.

- కె.చిన్నమల్లయ్య, కేశాపురం

ప్రోత్సహిస్తే మరింత మేలు

ఆదరణ లేకపోవడంతో ఈ వృత్తితో బతకలేం. వంశపారంపరంగా వస్తోంది కాబట్టి కొనసాగుతున్నాం. భవిష్యత్తులో ఈ కళ పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉంది. మాలాంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరికొన్ని రోజులైనా జీవిస్తుందని ఆశతో ఉన్నాం.

- బి.వెంకటరమణ, ఎద్దులవారిపల్లె.

మరికొందరు వాటితో కుటుంబాన్ని పోషించుకునే వారు. శివరాత్రి పర్వ దినాన గుడి చుట్టు మెరవణిలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగి పోతారు. ఈ సందర్భంగా వీరు ప్రదర్శించే నాట్యం మంత్రముగ్ధులను చేస్తుండగా, ఢమరుక నాదంతో కొండ మారుమోగుతుంది. పాలు, బెల్లం ఉంచిన పాత్రను పెడితే చుట్టూ గిర్రున తిరుగుతూ పాలు తాగే విన్యాసాలు అలరిస్తాయి.

అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలంలోని బురుజు కురవపల్లె, చిన్నకురవపల్లె, రెక్కలకొండపల్లె, ములకలచెరువు మండలం చీకటిమానుపల్లె, ఎద్దులవారిపల్లె, చిన్నమండెం మండలం కేశా పురం, వండాడి సత్యసాయి జిల్లాలోని తనకల్లు మండలం చిన్నఎద్దులవారిపల్లె, తదితర గ్రామాల్లో ఉన్నారు. కురబ సామాజిక వర్గానికి చెందిన అండె కురబలే ఈ మల్లయ్యదారులు. వీరిని ఒగ్గప్ప స్వాములని, గొడుగు మల్లయ్య లని, యల్లయ్య కుక్కలని, దేవరదారులని ఇలా.. ప్రాంతాన్ని బట్టి పిలుస్తుంటారు. కాలానుగు ణంగా మల్లయ్యదారులు కూడా ఈ వృత్తికి క్రమంగా దూరమయ్యారు. దీంతో వీరి సంస్కృతి పూర్తిగా అంతరించిపోయే పరిస్థితి కనిపిస్తోంది. చదువుకున్న యువత ఉపాధి, ఉద్యోగం వైపు వెళ్లడం, భిక్షాటనను చిన్నచూపుగా చూస్తుండ టంతో కొత్తతరం ఎవరూ ముందుకు రావడం లేదు. రానున్న రోజుల్లో మల్లయ్యదారులు ఇలా ఉండేవారని చెప్పుకునే పరిస్థితి కనిపిస్తోంది.



గ్రామంలో శివనామస్మరణ చేస్తున్న మల్లయ్యదార్లు

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : జేసీ

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమ స్యలను అధికారులు ఎప్పటిక ప్పుడు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎన్నో సమస్యలతో ప్రతినిత్యం తహసీల్దారు కార్యాల యం వస్తుంటారని.. త్వరగా పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సదస్సులో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రా ల్లో అర్జీలు ఇచ్చిన రైతులు తిరిగి జిల్లా కేంద్రానికి వస్తు న్నారని.. ఇక్కడ సమస్యల పరిష్కారం అయితే జిల్లా కేంద్రాలకు ఎందుకు వస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ సద స్సులో వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిం చాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూసమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. ఈప్రాం తంలో జరుగుతున్న రీసర్వే పకడ్బందీగా నిర్వహించాల న్నారు. కార్యక్రమం ఆర్డీవో జాన్ ఎర్విన్, తహసీల్దారు శివరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు పర్వీన్‌బేగం, శ్రీకాంత్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ భయం వద్దు...



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయం వద్దని.. అది మనుషులకు సోకదని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచా లకులు డాక్టర్ శారదమ్మ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవా రం బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గ్రుడ్లు, చికెన్ బాగా ఉడికించి తినవ చ్చని, దీనివల్ల ఎలాంటి జబ్బులు రావన్నారు. ఎలాంటి అపోహ లు నమ్మవద్దని తెలిపారు. అనంతరం కోడి గ్రుడ్లను పంపి ణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనపై ఎమ్మెల్యే ధ్వజం


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ గత ఐదేళ్ల అరాచక పాలనపై మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసెంబ్లీలో ధ్వజమెత్తారు. మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో షాజహాన్‌బాషా మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వనరులను తీవ్రంగా దెబ్బతీశారన్నారు. చంద్రబాబు సీఎం అయ్యే సమయానికి రాష్ట్రం ఆర్థిక లోటుతో కొట్టుమిట్టాడుతోందని, అయినా చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాలల్లో ప్రజలకు అందిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో ల్యాండ్, శాండ్, వైన్, శాండల్ వుడ్ మాఫియా కొనసాగించారన్నారు. ర్యాటిఫికేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేశారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో చిత్తూరు జిల్లాలో రైతులను బెదిరించి డీకేటీ భూములను వైసీపీ నాయకులు తక్కువ ధరలకు కొనుగోలు చేశారని ఆరోపించారు. కానీ కూటమి ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలపై విచారణ చేయించి, రైతులకు న్యాయం చేస్తోందన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.486 కోట్లు

- చర్చి పాస్టర్ల హర్షం

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.486 కోట్లు నిధులు కేటాయించడం హర్షనీయమని గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా నాయకుడు బోనాసి జాన్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీ పీటర్‌రాక్ చర్చిలో నిర్వహించిన పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు క్రైస్తవుల పక్షపాతి అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు దేవమణి, కమిటీ సభ్యులు దివాకర్, జీవరత్నం, బయ్యారెడ్డి, జీవరాజు, బాబు, ప్రేమ, రేచల్ శోభారాణి, నిర్మల, అలీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న గురుప్రసాద్

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మదనపల్లె పట్టణం శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో జ్ఞానాంబిక విద్యార్థులు మోహన్‌బాబు యూనివర్శిటీ విద్యార్థులతో గెలుపొంది ట్రోఫీ అందుకున్నారన్నారు. అలాగే స్పోర్ట్స్ విభాగంలో షాట్‌పుట్ పోటీలో కె.అమృత, డిస్కస్‌త్రో పోటీలో రుక్మిణి గోల్డ్ మెడల్ సాధించారన్నారు. క్రికెట్ పోటీలో తమ కళాశాల జట్టు రన్నర్స్‌గా నిలిచారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సామకోటవారిపల్లి పంచాయతీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సామకోటవారిపల్లెకు చెందిన మునిస్వామి కుమారుడు(డీజల్)గొల్ల వెంకటరమణ మద్యం విక్రయిస్తుండంతో పోలీసులు దాడులు చేసి వెంకటరమణతో పాటు మద్యం షాపు ఓనర్ మురళిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముస్తాబైన శివయ్య

- కొండలపై కొలువుదీరిన శైవక్షేత్రాలు
- విద్యుత్ దీపాలంకరణలో ఆలయాలు
- భారీగా తరలుతున్న భక్తులు
- నేడు మహాశివరాత్రి







తంబళ్లపల్లెలో మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో విద్యుత్ అలంకరణలో నీలకంఠేశ్వరస్వామి ఆలయం, కలకడ సిద్దేశ్వర స్వామి ఆలయ గాలిగోపురం, వివిధ పూలతో పీలేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న నిర్వాహకులు, కలికిరి పూలకొండలో వెలసిన మల్లేశ్వరస్వామి

మదనపల్లె/మదనపల్లె అర్బన్/బి.కొత్తకోట/కురబలకోట/ తంబళ్లపల్లె/ నిమ్మనపల్లె/ రామసముద్రం/పీలేరు/కలకడ/వాల్మీకిపురం/గుర్రంకొండ/కలికిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో కొండలపై కొలువుదీరిన శైవక్షేత్రాలు భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాయి. చోళరాజుల కాలంలో వెలసిన ఈ క్షేత్రాలు ఒకదానికి మించి మరొకటి కొండలపై కొలువై ఉన్నాయి. ఇక్కడికి ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఆలయాల వద్ద నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి, మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జున స్వామి, కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని అఖండ మల్లికార్జునస్వామి, రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి ఆలయాలను శివ భక్తులైన చోళరాజులు ఒకే వరుసలో కొండలపై ఆలయాలను నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ నాలుగు ఆలయాల్లో ఒకదానికి మించి మరొకటి ఘనమైన చరిత్ర, విశిష్టతను కలిగివున్నాయి.

కొండపై మల్లేశ్వరుని మహిమ

తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జున స్వామి ఆలయాన్ని చోళరాజుల కాలంలో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించినట్లు చెబుతున్నారు. మల్లయ్య భక్తుడు.. పశువులు కాచే సమయంలో ఆకాశం నుంచి పడిన కిరణం పడినచోట పుట్ట నుంచి వచ్చిన నాగుపాము నాట్యమాడిందని స్థానికంగా ప్రచారంలో వుంది. దీంతో శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన దిగ్గజాలు భూమిని తవ్వగా, శివలింగం ప్రత్యక్షం కావడంతో గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పురాణాలు వెల్లడిస్తున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే దేవునిగా మహిళలు సంతానం కోసం వరపడుతుంటారు. స్వామి ప్రతిరూపాలుగా చెబుతున్న మల్లయ్యధారులు మాఘమాసం నుంచే గ్రామాల్లో శివనామస్మరణ గ్రామాల్లో భిక్షాటన చేయడం ఆనవాయితీగా వస్తోంది.

ఏకశిల రాతి ఆలయం..

మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీలోని మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయం ఏకశిలరాతి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. అన్ని శైవక్షేత్రాల్లో ఆలయ నిర్మాణంలో భాగంగా సామగ్రిని కొండకింద ప్రాంతం నుంచి సమకూర్చుకుంటే, ఇక్కడి ఆలయానికి మాత్రం కొండపైనే బండను తొలచి తీసిన రాతిస్తంభాలతో ఆలయాన్ని నిర్మించిన ఆనవాళ్లు ఉన్నాయి. ఇక్కడ బండలు తీయగా ఏర్పడిన గుంతను కోనేరుగా ఏర్పాటు చేయడం ప్రత్యేకత. 1622లో మదనపల్లెను పాలించే అహోబిలనాయుడు ఈ ఆలయానికి మాన్యాన్ని ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. సముద్రమట్టానికి 3,600 అడుగుల ఎత్తులో వున్న ఈ ఆలయ నిర్మాణం శిఖరాగ్రంపై పెద్దరాతి బండపై పునాదులు లేకుండా నిర్మించారు. అంతేకాకుండా ఈ ఆలయ నిర్మాణానికి ఒకే రాతి నుంచి తీసిన బండలు, కూసాలు, దూలాలతో నిర్మించడం విశేషం.

దేవరకొండ వాలీశ్వరుడు

రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ దేవరకొండలో వెలసిన వాలీశ్వరుడికి మహిమాన్వితుడనే పేరుంది. శివభక్తుడైన వాలీ దేవరకొండపై ప్రకృతి అందాలకు ముగ్ధుడై అక్కడే సేద తీరినట్లు చెబుతుంటారు. ఈ క్రమంలో స్నానం చేసి వెంట తెచ్చిన శివలింగానికి పూజలు చేసి, కిష్కిందకు బయలుదేరే క్రమంలో ఆయన శివలింగాన్ని ఎత్తబోగా శివలింగం కదలదు. దీంతో ఆ ప్రాంత మహిమను గుర్తించి, అక్కడే లింగ ప్రతిష్ఠ జరిపి కిష్కిందకు వెళ్లినట్లు పురాణాలు చెబుతున్నాయి. అప్పటి నుంచి దేవరకొండ వాలీశ్వరకొండగా ప్రసిద్ధి చెందింది.

కోర్కెలు తీర్చే అఖండ మల్లేశ్వరుడు

కురబలకోట మండలం అంగళ్లు సమీపంలో మల్లయ్యకొండపై వెలసిన అఖండ మల్లేశ్వరుడు భక్తులు కోరిన కోర్కెలను తీర్చేదేవునిగా ప్రసిద్ధి చెందారు. చోళరాజులు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు పరమశివుడు సూచనల మేరకు చోళరాజులు ఆలయం నిర్మాణం చేపట్టినట్లు పురాణాలు చెబుతున్నాయి. అలాగే నిమ్మనపల్లె మండలంలోని నేలమల్లేశ్వర స్వామి ఆలయం, కొండయ్యగారిపల్లె పంచాయతీ ఊటవంకలోని సోమేశ్వర శివక్షేత్రంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరగనున్నాయి.

ముస్తాబైన శివాలయాలు

మదనపల్లె పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. ముఖ్యంగా మదనపల్లె పట్టణంలోని దేవళంవీధిలో సోమేశ్వరస్వామి ఆలయాన్ని ప్రధాన అర్చకుడు ఫణీంద్రకుమార్ విశేషంగా ముస్తాబు చేశారు. సీటీఎం రోడ్డులోని మంజునాథ స్వామి ఆలయంలో ఆలయకమిటీ సభ్యులు పరదాలు వుసి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివరాత్రి పురస్కరించుకుని మంజునాథ స్వామిని విశేషంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం సమీపంలోని వీరభద్రాద్రి (వీరన్నకొండ)పై బుధవారం ఉదయం నుంచి అభిషేకాలు, కొండపై రాత్రి జాగరణ, వీరభద్రస్వామికి పూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి. స్థానిక కోనేటి వీధిలోని లక్ష్మీ కామేశ్వరస్వామి దేవాలయం, పట్టణ పడమర పొలిమేరలోని ధర్మపథం ఆలయాలలో, ఏటిగడ్డ శివాలయంలో శివరాత్రి రోజున శివపార్వతుల కల్యాణోత్సవ వేడుకలు జరగనున్నాయి. అలాగే చింతపర్తి ఓబులేశ్వరస్వామి ఆలయంలో వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

కలకడలో: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో కలకడ కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయం ఎంతో పురాతనమైనది. మహాశివరాత్రి పర్వదినాన స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడానికి పలు జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. రాత్రి జాగారం చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ షామియానాలు ఏర్పాటు చేశారు. శివరాత్రి రోజున ఆలయంలో శిఖర దీప దర్శనం, రుద్రాభిషేకం, వృషభ వాహన సేవ, లక్ష బిల్వార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పీలేరులో: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పీలేరులోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం, దుర్గా హోమం నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు విరూపాక్షం కుమారస్వామి తెలిపారు.

గుర్రంకొండలో: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గుర్రంకొండలో సిద్దేశ్వరఆలయం, ప్యారంపల్లె మహేశ్వర ఆలయం, బురుజుపల్లె ఉమామహేశ్వర ఆలయం, సరిమడుగు మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలను నిర్వహించనున్నారు. ఆయా ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.


తంబళ్లపల్లె మల్లయ్య కొండపై నూతన ఆలయం


నిమ్మనపల్లె మండలం ఊటవంక సోమేశ్వర ఆలయంలోని శివ లింగం


బి.కొత్తకోటలోని బండెన్నస్వామి ఆలయం


మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపై నిర్మించిన ఏకశిల రాతి ఆలయం

కలికిరిలో: పట్టణంలోని పురాతనమైన సోమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పార్వతీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పుల్లారెడ్డి చెప్పారు. ఇందుకోసం ఆలయంలో కల్యాణ మండపాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇక గుట్టపాలెం పంచాయతీ పూలకొండలో వెలసిన భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో ఉత్సవాలు బుధవారం అభిషేకాలతో ప్రారంభమయ్యాయి. గురువారం స్వామివార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. మేడికుర్తి బాహుదా నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

శివరాత్రికి భక్తులకు మెరుగైన వసతులు

- టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండగ సందర్భంగా భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువుకు సమీపంలోని కనుగొండరాయస్వామి ఆలయంలో శివరాత్రికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, తాగునీటి వసతి, భక్తుల జాగరణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు శివరాత్రి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు శ్రీనివాసులు, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

గుర్రంకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి వేదపండితులు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం టీటీడీ నుంచి తెచ్చిన పరిమళభరిత సుగంధ ద్రావ్యాలతో ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంను నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని టీటీడీ జేఈవోకు వినతి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వాల్మీకిపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం తిరుపతి ఏడీ బిల్డింగ్ నందు టీటీడీ జేఈవో వీరబ్రహ్మంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన పట్టాభిరాముడి దేవాలయాన్ని 1997లో టీటీడీ దత్తత తీసుకుందని, ఒంటిమిట్ట కంటే ఎంతో ప్రాచుర్యం కలిగిన వాల్మీకి క్షేత్ర పట్టాభిరామాలయ అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో నిర్వహించిన బ్రహ్మోత్సవాల మాదిరిగానే ప్రస్తుతం 2025లో బ్రహ్మోత్సవాలను నిర్వహించాలని కోరారు. ఆలయంలో భక్తులకు కనీస మౌలిక వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అర్హులైన అర్చకులను నియమించాలన్నారు. దీనిపై స్పందించిన జేఈవో వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో సమస్యలపై తక్షణమే స్పందించాల్సిందిగా డిప్యూటీ ఈవో వరలక్ష్మిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోసూరి చంద్రమౌళి, రాజేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నేత కారపాకుల


పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన భాస్కర నాయుడు

పీలేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కేవీపల్లె మండలానికి చెందిన వైసీపీ నేత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కారపాకుల భాస్కర నాయుడు మంగళవారం జనసేనలో చేరారు. అమరావతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, భాస్కర నాయుడుకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. భాస్కర నాయుడుతోపాటు ఆయన అనుచరులు జనసేనలో చేరారు. తిరుపతి ఎమ్మెల్యే(జనసేన) ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, భాస్కర నాయుడిని పవన్ కళ్యాణ్‌కు పరిచయం చేసి చేరికకు సహకరించారు. పీలేరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పవన్ ఈ సందర్భంగా భాస్కర నాయుడుకు సూచించారు.

పేకాట స్థావరాలపై దాడులు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రాంతాలలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాచవేటివారిపల్లి సమీపంలో మంగతాయి ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 6మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండిరూ. రూ.28 వేలు స్వాధీనం చేసుకొన్నామన్నారు. అలాగే నిమ్మనపల్లి పంచాయతీ దిగువవీధిలో పేకాట ఆడుతున్న 4గురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.4వేలను స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మానవ మనుగడ

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహారం తీసుకోవాల్సిన అవసరం వుందని హైదరాబాద్‌కు చెందిన సేవ్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయరామ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు, ఔత్సాహికులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయరామ్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రేకులషెడ్డు ధ్వంసంపై ఫిర్యాదు

గుర్రంకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమిలేపల్లెకు చెందిన వెంకటేశ్వరాచారి తన సొంత స్థలంలో రేకులషెడ్డును నిర్మించుకొన్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ప్రకాశ్ రేకులషెడ్డు నిర్మించిన స్థలంలో తనకు భాగముందని షెడ్డును ట్రాక్టర్‌తో ధ్వంసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చర్యలు తీసుకొంటామని ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

కృత్రిమ కాళ్లకు ప్రత్యేక క్యాంపు

కలికిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాళ్లు కోల్పోయిన వారికి ఉచితంగా కృత్రిమ కాలును అమర్చే కార్యక్రమాన్ని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ చేపట్టినట్లు ఆ శాఖ సహాయ సంచాలకుడు ఆర్.వి.కృష్ణకిశోర్ తెలిపారు. మార్చి 4, 5 తేదీల్లో రాయచోటి కలెక్టరు కార్యాలయంలో ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వివరాలకు 8074623993, 9182778324, 08562-295480 సంప్రదించాలన్నారు.

బస్సుల కండీషన్ తనిఖీ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ 3-4 బస్సుల కండీషన్‌ను జిల్లా ప్రజారవాణా అధికారి రాము మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు సురక్షితంగా వారి గమ్యస్థానాలను చేర్చడం కోసం మంచి కండీషన్ ఉన్న బస్సులు నడిపేందుకు వీలుగా ప్రమాదాలు జరగకుండా ఉండటానికి ప్రతి రోజు బస్సులను పరిశీలించాలన్నారు. మెకానికల్ సూపర్‌వైజర్లు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహాశివరాత్రికి బుధవారం ఉదయం నుంచే మదనపల్లె నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మిట్స్ ఎంవోయూ ఒప్పందం


యూనివర్శిటీతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్ తదితరులు

కురబలకోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అమెరికాకు చెందిన బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్శిటీతో ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఆ యూనివర్శిటీ ప్రతినిధులు రామ్, ప్రోవోస్ట్, మొఖ్తార్, జాన్, కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్‌లు ఆ యూనివర్శిటీతో సంతకాలు చేసి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాల్లో సహాయ సహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలనే దానిపై సలహాలు, సూచనలు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ తులసీరామ్‌నాయుడు, ఇంటర్నేషనల్ రిలేషన్ మేనేజర్ విజయక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి : క్రిష్ణయ్య

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోత): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి క్రిష్ణయ్య సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అమరేంద్రబాబు ఆధ్వర్యంలో 25వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో సరస్వతీ దేవికి పూజలు నిర్వహించి విద్యార్థులకు హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కళాశాల చైర్మన్ రామచంద్రారెడ్డి, అధ్యాపకులు వెంకట్రాముడు, వెంకటరమణ, మాధవరెడ్డి, సునంద, సుప్రజావాణి, ఉషారాణి, సుమలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల రక్షణ కోరిన ప్రేమజంట

వాల్మీకిపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తమ పెద్దల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ మంగళవారం ఓ ప్రేమ జంట వాల్మీకిపురం పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా... పట్టణానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు రోహిత్‌సాయి(21) బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. మదనపల్లె మండలం అండేవారిపల్లెకు చెందిన జయరామ్ కుమార్తె అమృత(19) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం జరుగుతోంది. వీరు గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో గతవారం ఇంటి నుంచి వెళ్లిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉండటంతో స్థానిక సీఐ ప్రసాద్‌బాబును ఆశ్రయించారు. స్పందించిన ఆయన ప్రేమజంటకు రక్షణ కల్పిస్తూ ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.